


# విజయభాను

45 వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, మంగళవారం 09-08-2022 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 45 సంచిక : 276 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## భారత్‌కు మరో స్వర్ణం..

### ఫైనల్లో మెరిసిన పీవీ సింధు



బర్మింగ్‌హామ్: కామన్వెల్త్ క్రీడల్లో భారత స్టార్ షట్లర్, తెలుగు తేజం పీవీ సింధు స్వర్ణం సాధించింది. దీంతో పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానానికి ఎగబాకింది. తాజాగా బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్ విభాగం ఫైనల్స్‌లో సింధు.. కెనడా క్రీడాకారిణి మిచెలీ లీని ఓడించింది. తొలి గేమ్‌లో 21-15తో నెగ్గిన సింధు రెండో గేమ్‌ను 21-13తో కైవసం చేసుకుంది. దీంతో వరుస గేమ్స్‌లో ఆధిపత్యం చెలాయించి భారత్‌కు మరో పసిడి అందించింది. కాగా, కామన్వెల్త్ క్రీడల్లో ఆమెకు ఇదే తొలి స్వర్ణం కావడం విశేషం. అంతకుముందు 2014లో కాంస్యం గెలిచిన సింధు 2018లో రజతం సాధించింది. ఈ స్వర్ణంతో 2022 కామన్వెల్త్ క్రీడల్లో భారత్ మొత్తం 56 పతకాలు సాధించింది. అందులో 19 స్వర్ణాలు ఉండగా 15 రజతాలు, 22 కాంస్యాలు ఉన్నాయి.

సింధు సాధించిన ఇతర పతకాలు..

- 2016 రియో ఒలింపిక్స్‌లో రజతం.
- 2021 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం.
- 2018 ఆసియా గేమ్స్‌లో రజతం.

## విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు సర్వం సిద్ధం

### విజయసాయి రెడ్డికి రైల్వే మంత్రి హామీ



న్యూఢిల్లీ : విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుకు సర్వం సిద్ధం చేసినట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. భవన నిర్మాణానికి స్థల సేకరణ కూడా పూర్తయ్యిందని తెలిపారు. జోన్ ఏర్పాటుకు నిధులు కూడా సిద్ధంగా ఉన్నాయని అన్నారు. రాజ్యసభలో సోమవారం కేంద్రీయ విశ్వ విద్యాలయాల చట్ట సవరణ బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా వైఎస్సార్సీపీ సభ్యులు శ్రీ విజయసాయి రెడ్డి విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ రైల్వో జోన్ ఏర్పాటుకు సంబంధించిన డీపీఆర్‌ను ఆమోదించినట్లు మంత్రి తెలిపారు. అంతకు ముందు బిల్లుపై విజయసాయి రెడ్డి మాట్లాడుతూ రైల్వేకు సంబంధించి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై రైల్వే మంత్రికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో భాగంగా విశాఖ కేంద్రంగా ప్రకటించిన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటును వేగవంతం చేయాలని కోరారు. రైల్వే మంత్రిత్వ శాఖ వద్ద మూడు సంవత్సరాలుగా డీపీఆర్ పెండింగ్‌లోనే ఉందని ఆయన పేర్కొన్నారు. భారతీయ రైల్వే ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే వ్యవస్థ భారతీయ రైల్వే ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే వ్యవస్థ. 68

తరువాయి 2లో..

## ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల పాత్ర ఉండకూడదు

### పంటల సాగుపై సలహాలు అందించాలి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



అమరావతి (విజయభాను న్యూస్) : రైతు భరోసా కేంద్రాలను పౌరసరఫరాల శాఖతో అనుసంధానం చేసే అంశంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం సమీక్ష చేపట్టారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. ఆర్బీకేల కార్యకలాపాలు సమర్థవంతంగా కొనసాగడానికి లైన్ డిపార్ట్‌మెంట్లతో సమర్థవంతమైన సమన్వయం ఉండాలని అధికారులను ఆదేశించారు.

ఇందుకు మార్గదర్శక ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. క్రమం తప్పకుండా భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు సాయిల్ కార్డులు ఇవ్వాలని ఆదేశించారు. అదే విధంగా సాయిల్‌కార్డులతోపాటు ఆ భూమికి తగిన విధంగా ఎరువులు, పంటలసాగుపై సలహాలు అందించాలన్నారు. ఖరీఫ్ పంటల కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. కనీస మద్దతు ధర కన్నా.. ఒక్క పైసా కూడా తగ్గకూడదని పేర్కొన్నారు. రైతులకు ఎంఎస్‌పీ ధర అందాల్సిందేనన్న ముఖ్యమంత్రి.. ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల పాత్ర ఉండకూడదని స్పష్టం చేశారు.

## వెంకయ్య పని విధానం.. ఎంతో స్ఫూర్తిదాయకం

### ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అత్యంత జనాదరణ ఉన్న నాయకుడు

### వీడ్కోలు సమావేశంలో ప్రధాని మోదీ



దిల్లీ: ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అత్యంత జనాదరణ ఉన్న నాయకుడని.. అనేక బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించారని ప్రధాని నరేంద్రమోదీ కొనియాడారు. ఈ నెల 10న ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పదవీకాలం పూర్తిచేసు కుంటున్నారు. ఈ సందర్భంగా రాజ్యసభలో సోమవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. వెంకయ్య పనితీరు ఎందరికో స్ఫూర్తిదాయకమంటూ ఒకింత భావోద్వేగానికి గురయ్యారు.

"వెంకయ్యనాయుడుతో భుజం కలిపి పనిచేసే అదృష్టం నాకు లభించింది. ఎమ్మెల్యేగా, రాజ్యసభ సభ్యుడిగా.. సభా నాయకుడిగా ఆయన సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించారు. ఏ పదవిలో ఉన్నా అంకిత భావంతో పనిచేశారు. తన బాధ్యతలను ఎప్పుడూ బరువుగా భావించలేదు. వెంకయ్య పని విధానం.. ఎంతో స్ఫూర్తిదాయకం. ఆయన శ్రద్ధ, బాధ్యత ప్రతి ఒక్కరికీ ఆదర్శం. సమాజం, ప్రజాస్వామ్యం ఆయ న్నుంచి చాలా నేర్చుకోవాలి" అనిమహిళా పోలీసులు , వెల్ఫేర్ అసిస్టెంట్ లు వారి పరిధిలో ఉన్న ప్రభుత్వ పాటశాలల్లో తరుచూ మోదీ ప్రశంసించారు.

"వెంకయ్యనాయుడు ఏక వాక్య సంబోధనలు చాలా ప్రాచుర్యం పొందాయి. అవి చాలా చమత్కారంగా ఉంటాయి. కొన్నిసార్లు అవే విజయ సూత్రాలుగానూ

తరువాయి 2లో..

## జర్నలిస్టుల సొంత ఇంటి కల నెరవేరుస్తాను


### పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్



అనకాపల్లి విజయభాను న్యూస్ : జర్నలిస్టుల సొంత ఇంటి కల నెరవేరుస్తానని, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాధ్ అన్నారు. సోమవారం రోటరీ కళ్యాణ మండపంలో అనకాపల్లి జర్నలిస్టులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ముందు ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు ఇచ్చిన, హామీలు నెరవేరుస్తానన్నారు. ఇప్పటికే కాలయాపన జరిగిన మాట, వాస్తవమేనని, అన్నారు. పనిఒత్తిడి కరోనా వంటి, సమస్యల

తరువాయి 2లో..

## మరో 24 గంటల్లో కోస్తాంధ్ర, తెలంగాణకు భారీ వర్షాలు!



**అమరావతి,** ఒడిశా- కోస్తాంధ్ర తీరానికి సమీపంలో అల్పపీడనం కొనసాగుతోంది. రాగల 24 గంటల్లో ఇది మరింతగా బలపడి వాయుగుండంగా మారే సూచనలు ఉన్నాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. వాయవ్య దిశగా కదులుతూ ఛత్తీస్‌గఢ్, ఒడిశాపై కేంద్రీకృతమయ్యే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో మరో 24 గంటల్లో కోస్తాంధ్ర, తెలంగాణ, ఉత్తర కోస్తా జిల్లాలు,

తరువాయి 2లో..




## స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకూడదు

### - అర్జీలను కాల పరిమితిలోగా పరిష్కరించాలి - జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లికార్జున



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : స్పందన కార్యక్రమంలో వచ్చే వినతులపై శాఖాధిపతులు తక్షణమే ప్రతి స్పందించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లికార్జున పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలియజేసి వాటిని పరిష్కరించు కునేందుకు చక్కని వేదిక స్పందన కార్యక్రమం రూపొందించబడిందని అన్నారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో స్పందన దరఖాస్తుల పరిష్కారం మరియు పలు విషయాల పై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భముగా జిల్లా కలెక్టర్ వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు స్పందనలో వచ్చిన దరఖాస్తులు వాటి పరిష్కారము , పెండెన్సీ పై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లికార్జున మాట్లాడుతూ స్పందన వినతుల పరిష్కారంలో అలక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. స్పందన కార్యక్రమం ద్వారా వివిధ సమస్యలపై ప్రజల నుండి స్వీకరించిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశిత సమయంలో పరిష్కరించాలన్నారు. స్పందన అర్జీలు ఎట్టి

తరువాయి 2లో..

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి ..



## - జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి లక్ష్మీశ

**విశాఖపట్నం** (విజయభాను న్యూస్) : ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ పేర్కొన్నారు. సోమవారం ఆయన 5వ జోన్, 49వ వార్డు పరిధిలో పి. ఆర్. గార్డెన్స్, మాణిక్యమాంబ కాలనీ, చాకలి గెడ్డ తదితర ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్ అల్లు శంకర్ తో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటుగా పరిసరాల పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రస్తుతం ప్రజలు పరిసర ప్రాంతాల్లో నీరునిల్వ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రజలు స్వచ్ఛందంగా వారానికి ఒక రోజు "డ్రై డే" పాటించాలని తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని అన్నారు. ప్రతి ఇంటి సెప్టిక్ ట్యాంకు గొట్టానికి మెష్ కట్టాలని ప్రజలకు సూచించారు. మలేరియా, డెంగ్యూ కేసులు వస్తే కార్యదర్శులు, వాలంటీర్లదే బాధ్యత అని హెచ్చరించారు. అలాగే ప్లాస్టిక్ నిషేధంపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తామని ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలతోపాటుగా వ్యాపారస్తులు వద్దనుండి అనూహ్య స్పందన లభిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సహకారంతోనే ప్లాస్టిక్ నిషేధం సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు

వార్డులో విస్తృత పర్యటన చెపట్టిన ఆయన వార్డులో ప్రధాన గెడ్డలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు గెడ్డలో వ్యర్థాలను తొలగించాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. క్లాప్ వాహనాలు ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణకు ప్రతి రోజు వెళ్ళడంలేదని స్థానికుల నుండి ఫిర్యాదులు వస్తాయని అటువంటి ఫిర్యదులు రాకుండా చూడాలని ప్రజారోగ్యపు అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జివిఎంసి అయిదవ జోన్, కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, సహాయక వైద్యాధికారి డాక్టర్ ఏ. రాజేష్, టౌన్ ప్లానింగ్ ఏసిపి అరుణ వల్లి, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాస్, సహాయక ఇంజినీర్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ కళా పివిఆర్ జన్మదిన వేడుకలు

- జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన అభిమానులు కార్యకర్తలు
- పలు సామాజిక సేవా కార్యక్రమాలు



విశాఖపట్నం (విజయభాను న్యూస్): విశాఖపట్నంలో పేరుగాంచిన ప్రముఖ వైద్యాలయం కళా హాస్పిటల్ అధినేత, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దక్షిణ నియోజకవర్గ మాజీ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి జన్మదిన వేడుకలు నగరంలో పలు సామాజిక కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమయ్యాయి.సంఘ సేవకుడిగా, కళాకారులను ప్రోత్సహిస్తూ కళామతల్లికి విశేష సేవలందిస్తున్నారు, ఆధ్యాత్మి కవేత్తగా, పార్టీలకు అతీతంగా అజాతశత్రువుగా పేరుగాంచిన డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి జన్మదిన వేడుకలకు నగరం లోని పలు ప్రాంతాలతో పాటు ముఖ్యంగా విశాఖ దక్షిణ నియోజకవర్గము నుండి భారీ సంఖ్యలో అభిమానులు కార్యకర్తలు తరలివచ్చి ఎవరికి తోచిన విధంగా వారు శుభాకాంక్షలు తెలియజేస్తూ తన అభిమానాన్ని చాటుకున్నారు. స్థానిక అల్లిపురం భీమ్ నగర్ లోని ఏ యు టి డి వృద్ధాశ్రమంలో వృద్దులకు ఉదయం అల్పాహారాన్ని అందజేశారు. మధ్యాహ్నం ప్రేమ సమాజంలోని విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం మధ్యాహ్నా భోజనాన్ని అందజేశారు. సాయంత్రం స్థానిక కళా హాస్పిటల్ ప్రాంగణంలో వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి మాట్లాడుతూ శ్రీకాకుళంలోని మారుమూల పల్లెటూర్లో జన్మించిన తాను ఉన్నత చదువులు కోసం విశాఖపట్నం చేరుకున్నానని ఈ నగరంలోనే డాక్టర్ పట్టా పొందానని అప్పటినుంచి విశాఖ మహానగరంలోనే స్థిరపడి డాక్టర్ వృత్తిలో ఉంటూ ఎంతోమంది అభాగ్యులకు ఉచితంగా సేవ చేసే అదృష్టం కలిగిందన్నారు. డాక్టర్ వృత్తిలో ప్రభుత్వ అధికారిగా విశాఖ ఏజెన్సీలో సుదీర్ఘకాలం పాటు గిరిజనులకు వైద్య సేవలు అందిస్తూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం జరిగిందన్నారు. మహా విశాఖ నగర పాలక సంస్థ ప్రధాన వైద్యాధికారి హెూదాలో సేవలందించడం ఎంతో సంతృప్తిని పొందానన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరింత ప్రజా సేవ చేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డాక్టర్ పివిఆర్ కు శుభాకాంక్షలు తెలియజేసిన పలువురు రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులు, వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లు డాక్టర్ సనపల రవీంద్ర భరత్,బెందాళం పద్మావతి, ఏపీ మెకానైజ్డ్ బోట్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్,ప్రజా గాయకుడు దేవిశ్రీ, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు వంకాయలు మారుతి ప్రసాద్, పలువురు గ్రేటర్ కార్పొరేటర్లు, వివిధ వార్డుల అధ్యక్షులు, ప్రభుత్వ అధికారులు, ఎన్ వెంకట్ రెడ్డి, జెడిఆర్ సివిల్ కన్స్ట్రక్షన్స్ అధినేత అంపోలు జగదీష్, హ్యూమన్ రైట్స్ నేషనల్ ప్రెసిడెంట్ సుగుణ కుమార్ మరియు కళా హాస్పిటల్ సిబ్బంది, అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.











మొదటి పేజీ తరువాయి

# విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు సర్వం సిద్ధం

వేల కిలోమీటర్ల రైల్వే లైన్లు ఉన్నాయి. ప్రతి రోజు 21వేల ట్రైన్లు నడుస్తున్నాయి. దేశంలో 7350 రైల్వే స్టేషన్ల నుండి ప్రతిరోజు 2.2 కోట్ల మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారని శ్రీ విజయసాయి రెడ్డి తెలిపారు. రోజుకు 30 లక్షల టన్నుల సరుకు రవాణా జరుగుతుందని తెలిపారు. ఇంతటి గొప్ప వ్యవస్థకు సారథ్యం వహిస్తున్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ఆయన అభినందించారు. ఏపీలో రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలి. విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేయనున్న సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌లో రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని శ్రీ విజయసాయి రెడ్డి మంత్రిని కోరారు. దేశంలో మొత్తం 21 రైల్వే రిక్రూట్మెంట్ బోర్డులు ఉన్నా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు లేదు. దీంతో ఉద్యోగార్థులు రైల్వే పరీక్షల కోసం పక్క రాష్ట్రంలో సికింద్రాబాద్ కు వెళ్లాల్సి వస్తుందని ఆయన అన్నారు.

**వైజాగ్ స్టీల్ ప్లాంటుకు తగినన్ని వ్యాగన్లు కేటాయించాలి**

వైజాగ్ స్టీల్ ప్లాంటుకు డిమాండ్‌కు తగ్గట్టుగా వ్యాగన్లు అందుబాటులో లేకపోవడంతో బొగ్గు సరఫరాలో కృత్రిమ కొరత ఏర్పడుతోంది. తద్వారా ఉత్పత్తి కుంటుపడుతోందని విజయసాయి రెడ్డి అన్నారు. వ్యాగన్ల కొరత కారణంగా మహానది కోల్ ఫీల్డ్ నుంచి వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు తగినంతగా బొగ్గు సరఫరా చేయలేక పోతున్నారు. ఫలితంగా స్టీల్ ప్లాంటులో ఒక బ్లాస్ట్ ఫర్నేస్ మూసివేయాల్సి వచ్చింది. దీనివలన ఉక్కు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడిందని అన్నారు. సాలీనా 28 వేల కోట్ల టర్నోవర్‌తో విజయవంతంగా నడుస్తున్న వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటుపరం చేయాలనుకోవడం సరికాదని ఆయన అన్నారు. లాభాల బాటలోనున్న సంస్థలు ప్రైవేటు పరం చేయకూడదన్నది బీజేపీ ప్రభుత్వం విధానం అయినప్పటికీ విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటుపరం చేయాలనుకోవడం శోచనీయని అన్నారు.

**రైల్వేలో 2.97 లక్షల ఉద్యోగాల ఖాళీలు**

రైల్వేలో 2.97 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వీటిని యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలని శ్రీ విజయసాయి రెడ్డి కోరారు. 2020-21లో 9529 ఖాళీలు భర్తీ చేయగా 2021-22లో 10637 ఖాళీలు మాత్రమే భర్తీ చేశారు. ఈ లెక్కన మొత్తం ఖాళీలు భర్తీ చేయడానికి 30 ఏళ్ళు పడుతుంది. 2019లో రైల్వే ఉద్యోగాల భర్తీ కోసం జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా అభ్యర్థుల నుండి దరఖాస్తు రుసుం రూపంలో రైల్వే శాఖకు 864 కోట్ల ఆదాయం చేకూరింది. 2019లో నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ నేటి వరకు ఎందుకు భర్తీ చేయలేకపోతున్నారని రైల్వే మంత్రిని ప్రశ్నించారు. యూపీఎస్సీ మాదిరిగా రైల్వేలో కూడా ఉద్యోగాల భర్తీ నిర్ణీత కాలంలో ప్రతి సంవత్సరం జరగాలని విజయసాయి రెడ్డి అన్నారు. యూపీఎస్సీ అనుసరిస్తున్న విధానాన్ని రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు పరీక్షల్లో ఎందుకు అమలు చేయకూడదని ప్రశ్నించారు.

**మహిళల భాగస్వామ్యం పెరగాలి**

రవాణా, లాజిస్టిక్ రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలని విజయసాయి రెడ్డి సూచించారు. లాజిస్టిక్ రంగంలో 20% మంది మాత్రమే మహిళా ఉద్యోగులు ఉన్నారు. కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్ పొందిన వారిలో మహిళలు కేవలం 1 శాతం మాత్రమే. రవాణా, లాజిస్టిక్ రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెంపొందించేందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం చేపట్టాలని కోరారు. సెంట్రల్ యూనివర్శిటీలో ఖాళీలు భర్తీ చేయాలి సెంట్రల్ యూనివర్శిటీల్లో ఏర్పడ్డ ఖాళీలు యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలని శ్రీ విజయసాయి రెడ్డి సూచించారు. దేశంలో కేంద్ర విద్యా శాఖ పరిధిలో ఉన్న 45 కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో 20 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సెప్టెంబర్ 4వ తేదీలోపు ఈ ఖాళీలను భర్తీ చేయాలని కేంద్ర విద్యా శాఖ కోరింది. నిర్దేశించిన సమయంలో ఈ ఖాళీలు భర్తీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు. నియోజకవర్గాల పునర్విభజనలో జనాభానే ప్రాతిపదిక కాకూడదు రాజ్యసభలో ప్రభుత్వానికి విజయసాయి రెడ్డి విజ్ఞప్తి

# వెంకయ్య పని విధానం.. ఎంతో స్ఫూర్తిదాయకం

మారాయి. ఆయన ప్రతిమాటను అందరూ విన్నారు. ప్రాధాన్యం, గౌరవం ఇచ్చారు. ఎన్నడూ కౌంటర్ చేయలేదు. ఆయనేం మాట్లాడినా అందులో లోతైన భావం ఉంటుంది. ఇక భారతీయ భాషలపై ఆయనకున్న ఆసక్తి, పట్టు ఎప్పటికీ ప్రత్యేకమే. దీనిపై ప్రతిఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి. సభను నడిపే విధానంలో ఈ ప్రత్యేకత ప్రతిబింబించింది. రాజ్యసభ పనితీరును పెంచడానికి అది ఎంతగానో దోహదపడింది. ఆయన హయాంలో రాజ్యసభ ఉత్పాదకత 70శాతానికి పెరిగింది. ఎంపీల హాజరు కూడా మెరుగుపడింది. ఉపరాష్ట్రపతిగా.. యువత సంక్షేమానికి కృషి చేశారు. యువశక్తిపై ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన చాలా సార్లు ఓ మాట చెబుతుంటారు. 'నేను రాజకీయాల నుంచి రిటైర్ అవుతున్నాను గానీ.. ప్రజా జీవితం నుంచి అలసిపోను అని'. అందువల్ల రాజ్యసభ ఛైర్మన్‌గా మీ బాధ్యతలు ఇక్కడితో ఆగిపోవచ్చు. కానీ మీ అనుభవాల నుంచి మేం మరిన్ని ప్రయోజనాలను పొందడం మాత్రం కొనసాగుతంది" అని ప్రధాని ఉద్విగ్నభరితులయ్యారు. ప్రధాని ప్రసంగం విని వెంకయ్యనాయుడు కూడా ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు.

# స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకూడదు

పరిస్థితుల్లోనూ రీ ఓపెన్ కాకూడదని, కాలపరిమితిలోగా దరఖాస్తులన్నింటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. రెండు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకొని ఇంకా ప్రొబేషన్ పూర్తి కాని సచివాలయం ఉద్యోగులకు వెంటనే ప్రక్రియ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వము ఇచ్చిన కొత్త సవరణ ప్రకారంగా సచివాలయం ఉద్యోగులకు జీతాలు అందుతున్నాయా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గుర్తించిన ప్రాధాన్యత పనులు పరిష్కారానికై ప్రభుత్వం ప్రతి సచివాలయానికి 20లక్షల రూపాయలు కేటాయించటం జరిగిందన్నారు. పని అంచనా ఎటువంటి రాజీలు లేకుండా చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు పేర్కొన్న సమస్యలను పరిష్కారం చేయటానికి సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి ఇఈ కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలిస్తున్నారని, దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఏఎన్ఎంలు, తనిఖీలు నిర్వహించి పిల్లల సంక్షేమం కొరకు కృషి చేయాలన్నారు. తదుపరి జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమంలో ప్రజలనుండి విజ్ఞప్తులు స్వీకరించారు. సోమవారం స్పందన కార్యక్రమం లో 180 విజ్ఞప్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కే.యస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సొంత ఇంటి కల నెరవేరుస్తాను

వలన, ఆలస్యమైంద న్నారు. త్వరలోనే, ఇంటి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో ప్రెస్ క్లబ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటానన్నారు. అందుకు తను పది లక్షల రూపాయలు ఇస్తానని ప్రకటించారు. అలాగే జర్నలిస్టులకు జీవిత భీమా కోసం చర్యలు తీసుకుంటామన్నారు. వందమంది, పాత్రికేయులకు తొలి విడతగా ఇళ్ల స్థలాలు ఇల్లులు, మంజూరు చేయడం జరుగుతుందన్నారు. దశల వారిగా మిగిలిన వారికి కేటాయిస్తానన్నారు. ముఖ్యమంత్రిజగన్మోహన్‌రెడ్డి సహకారంతో జిల్లా రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళికలు జరుగుతున్నాయన్నారు. అందుకు జర్నలిస్టులు సహకారం అందించాలన్నారు. అనకాపల్లి మండలంలోని కోడూరులో ఈనెల 29న 120 ఎకరాలలో ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. జిల్లా అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముందు ముందు జరిగే అభివృద్ధికి అందరూ సహకారం అందించాలని కోరారు. ఈసందర్భంగా మంత్రి అయిన సందర్భంగా అమర్‌నాద్‌ను జర్నలిస్టులు సత్కరించారు. ముందుగా పెంటకోట సీతారాం, దేవకి, మద్దాల రాంబాబు, మద్దాల కృష్ణ, భీశెట్టి వెంకటేష్, గంటా గోవింద, పెంటకోట జోగనాయుడు, తదితరులు జర్నిలిస్టుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, కశింకోట, మునగపాకకు చెందిన విలేకర్లు పాల్గొన్నారు. వైసీపీ నాయకులు మందపాటి జానకిరామరాజు, ఎంపిపి గొర్లి సూరిబాబు, మళ్ల బుల్లిబాబు, జాజుల రమేష్, మలసాల కిషోర్, దంతులూరి శ్రీధర్‌రాజు, తదితరులు వేదిక అలంకరించారు.

# మరో 24 గంటల్లో కోస్తాంధ్ర, తెలంగాణకు భారీ వర్షాలు!

ఒడిశాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈనెల 9, 10 తేదీల్లో తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం పడొచ్చని వాతావరణశాఖ తెలిపింది.

# ఐఐటిజెఈఈ మెయిన్ ఫలితాలలో ఫిట్జీ విద్యార్థుల ప్రతిభ











విశాఖపట్నం (విజయభాను న్యూస్) : సోమవారం ప్రకటించిన ఐఐటి జెఈఈ మెయిన్ ర్యాంకుల ఫలితాలలో ఫిట్జీ విశాఖపట్నంకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. ఫిట్జీ విద్యార్థి సౌమిత్ర గార్గ్ దేశంలో మొదటి స్థానంలో ఏఐఆర్-1 నిలవగా, పార్థ భరద్వాజ్ దేశంలో మూడవ స్థానంలో ఏఐఆర్-3గా నిలిచారు. ఫిట్జీ వైజాగ్ విద్యార్థులు ఆల్ ఇండియా ఓపెన్ కేట గిరిలో మయాంక పరా శ్రామికా 719వ ర్యాంక్, అక్షత్ ఠాకూర్ 1304వ ర్యాంక్, లోహిత్ పట్నా యక్ 1632వ ర్యాంక్, కలవల నవ్య 1990వ ర్యాంక్ను పొందగా, మొత్తం 274మంది విద్యా ర్థులు జెఈఈ మెయిన్ వ్రాయగా 182 మంది విద్యా ర్థులు జెఈఈ అడ్వాన్స్డ్కు అర్హత పొందారు. ఈ సంద ర్భంగా మేనేజింగ్ పార్టనర్ పెండేల మస్తాన్రావు మాట్లాడుతూ ఈ విజయానికి కారణమైన విద్యార్థులును, వారి తల్లిదండ్రులను, అధ్యాపకులను అభినందించారు.

# వారంలో ఒక్క రోజు ప్రజారవాణాను ఉపయోగించండి

### - నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి



**విశాఖపట్నం** (విజయభాను న్యూస్) : కాలుష్య నియంత్రణలో భాగంగా వారంలో ఒక్క రోజు ప్రజారవాణాను ఉపయోగించాలని జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె కాలుష్య నియంత్రణలో భాగంగా తమ క్యాంపు కార్యాలయం నుండి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నడుచుకుంటూ బస్ స్టాప్ కు వచ్చి ఎపిఎస్ఆర్టిసి బస్సులో జివిఎంసి ప్రధాన కార్యలయంనకు చేరుకొని "డయల్ యువర్ మేయర్", "స్పందన" తదితర కార్యక్రమాలు నిర్వహించి మరల బస్సులో తిరిగి ప్రయాణమై వెళ్ళారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ఒకే కుటుంబంలో భార్య, భర్త ఉద్యోగాలు చేస్తున్న వారికి రెండు, మూడు వాహనాలు కలిగియుంటారని, అటువంటి వారు వారంలో ఒక్క రోజు తమ వాహానాలను విడిచిపెట్టి ప్రజా రవాణా ద్వారా వారి వారి కార్యాలయాలకు చేరుకొని, విధులు నిర్వహించి నగర కాలుష్య నియంత్రణకు వారి వంతు కృషి చేయాలని సూచించారు.

ఇప్పటికే జివిఎంసి కమిషనర్ ఆదేశాలతో జివిఎంసి ఉద్యోగులు అందరూ వారి వారి వాహనాలను వదిలి కార్యలయంనకు చేరుకున్నారని తెలిపారు. ఇప్పటి నుండి కాలుష్యంపై దృష్టిపెట్టి దాని నియంత్రణకు నగర ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు ఇక్కట్లు రోడ్డు సౌకర్యం కల్పించాలని

## గిరిజన సంఘం మండల నాయకులు డిమాండ్



అనంతగిరి (విజయ భాను న్యూస్) : అనంత గిరి మండలం వలసి పంచాయతీ పరి ధిలో సోమ వారం గల బొడ్డ పాడు నుండి చిమ్మ గెడ్డ వరకు రోడ్డు మంజూరు చెయ్యా లని. గిరి జన సంఘం మండల నాయకుడు కె.మోహన్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం రోడ్లు మంజూరు చేయాలని గ్రామస్తులు గిరిజన సంఘం నాయకుడు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో. చిన్నారావు బాబురావు. చిలకమ్మా తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

అనంతగిరి (విజయభాను న్యూస్) : తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గం ఇన్ చార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ గారి అధ్వర్యంలో అనంతగిరి మండలం కొండిభ పంచాయితీ తోకవలస గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ఎస్ టి సెల్ అధ్యక్షులు సివేరి దొన్నుదొర మాజీ యస్సీ మరియు యస్టీ మిషన్ మెంబర్ సివేరి అబ్రహం విచ్చేయు చున్నారు. కావున అరకు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మండల అధ్య క్షులు, రాష్ట్ర జిల్లా స్థాయి నాయకులు, మహిళ నాయకు రాల్లు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్య క్రమానికి విచ్చేసి ఆశీనులు కావలసిందిగా కోరుతున్నాము.

## సీజనల్ వ్యాధుల నియంత్రణ కొరకు అవగాహన

భీమునిపట్నం : విజయభాను న్యూస్ జీ వి ఎం సీ వారి ఆదేశానుసారం జోనల్ కమీషనర్ ఎస్ వెంకట రమణ ఆధ్వర్యంలో తగరపువలస ఆదర్శ నగర్ 2 సచివాలయం పరిది లో సీజనల్ వ్యాధుల నియంత్రణ కొరకు అవగాహన కార్యక్రమం లో బాగంగా పలు జాగ్రత్తలు,సూచనలు తెలియజేశారు. దీనితో పాటు గా ఒకసారి ఉపయోగించి పడవేసే ప్లాస్టిక్ నిర్మూలన కొరకు నగర ప్రజలు అందరూ సహరించాలని కమిషనర్ కోరారు.

ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బంది సంబంధిత వార్డ్ కార్యదర్శి వాలంటీర్స్ మలేరియా సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

## కేశన కుర్రు సహకార సంగం నూతన చైర్మన్ గా ఇందుకూరి రంగరాజు పదవీ బాధ్యతలు స్వీకరణ



ఐ పోలవరం (విజయభాను న్యూస్) : ఐ పోలవరం మండలం పరిధిలోని కేశన కుర్రు సహకార సంగం నూతన చైర్మన్ గా ఇందుకూరి రంగరాజు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన త్రిసభ్య కమిటీ తో ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్ గా ఇందుకూరు రంగరాజు, డైరెక్టర్ గా మెల్లం విజయ కుమారి, చింతా త్రిమూర్తులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎంపీపీ మోర్త మిరియం జ్యోతి, జెడ్ పి టి సి ముదునూరి సతీష్ రాజు, మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతిరాజు, స్థానిక సర్పంచ్ బీరా సత్య కుమారి, ఢిల్లీ నారాయణ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సొసైటీ సిబ్బంది, సర్పంచులు, ఎంపిటిసిలు గ్రామ ప్రజలు రంగరాజు ని పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

## చిన్ననాటి మిత్రుడికి ఫాబ్ ఆధ్వర్యంలో సన్మానం

భీమునిపట్నం (విజయభాను న్యూస్) : విజయభాను న్యూస్ ఫాబ్ ఆధ్వర్యంలో చిన్ననాటి స్నేహితుడు, చిట్టివలస జ్యూట్ మిల్ మెకానికల్ వర్కర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రవ్వా నరసింగరావును స్నేహితుల దినోత్సవం సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫాబ్ ప్రతినిధి సూర్య శ్రీనివాస్ ముసునూరి మాట్లాడుతూ చిన్నతనంలో తమతోపాటు చదువుకున్న రవ్వా నరసింగరావు విద్యార్థి నాయకుడిగా ప్రస్థానం మొదలు పెట్టి తన పోరాటాలతో కార్మిక నాయకుడిగా ఎదిగారని అన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే రవ్వా నరసింగరావు ను స్నేహితుల దినోత్సవం నాడు సత్కరించడం చాలా ఆనందంగా ఉందనీ చెప్పారు.రవ్వా నరసింగరావు మాట్లా డుతూ చిన్న నాటి స్నేహితులు ఇలా తనకు సన్మానం చేయ డం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, తన జీవితంలో గుర్తుండి పోయే రోజని అన్నారు. తను కూడా ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో పాల్గొంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫాబ్ సభ్యులు సన్నీ కాళ్ళ, శ్రీరామ మూర్తి, సూర్యనారాయణ మూర్తి, కట్టమూరి రమణ, కట్టమూరి అశోక్, నరేంద్ర కుమార్, సాయి, బంగార్రాజు, దేవానంద్ పాల్గొన్నారు.


# క్విట్ ఇండియా స్ఫూర్తితో పోరాడుదాం

## సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.ఎస్.ఎన్ మూర్తి



భీమునిపట్నం (విజయ భాను న్యూస్) : క్విట్ ఇండియా స్ఫూర్తితో లేబర్ కోడ్స్ రద్దుకై పోరాడు దామనీ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.ఎస్.ఎన్ మూర్తి అన్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో జరిగిన క్విట్ ఇండియా ఉద్యయం నేటికీ క 80 సంవత్స రములు పూర్తి అయిన సందర్భంగా సోమ వారం భీమిలి జోన్ సి ఐ టి యు ఆధ్వర్యంలో చిట్టివలస నుండి తగరపువలస మార్కెట్ వరకు ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ లో క్విట్ ఇండియా స్ఫూర్తితో పోరాడుదాం, కార్పొరేట్ల బారినుండి దేశాన్ని రక్షించుకుందాం, కార్మికులకు నష్టమైన లేబర్ కోడ్స్ ను రద్దు చేసుకుందామని కార్మికులు నినాదాలు చేశారు. అనంతరం మార్కెట్ వద్ద రాస్తారోకో జరిగింది. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ నాడు దేశ స్వాతంత్ర్యం కోసం ప్రజలు ఉవ్వెత్తున కదిలి స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారనీ అన్నారు. అదేవిధంగా 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమ పిలుపుమేరకు లక్షలాది మంది ప్రజలు దేశము నలుమూలలా ఉద్యమాలు సాగించారనీ, ఆ స్ఫూర్తితో బిజెపి కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని, అలాగే ఉన్నతమైన ప్రభుత్వరంగ ప్రైవేటీకరణ ఆపాలని దేశ ప్రజలంతా కలిసి పోరాడా లన్నారు. అప్పుడే దేశ స్వాతంత్ర్యాన్ని కార్పొరేట్ల బారి నుండి నిలబెట్టుకోగలుగుతామనీ అన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను నిరంతరం పేద ప్రజలు స్మరించుకోవాలనికోరారు. ఈ కార్యక్రమంలో సి ఐ టి యు జోన్ అధ్యక్షులు రవ్వ నరసింగరావు, రీసు చిన్నారావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# బాలల కోసం స్వాతంత్ర్య అమృతోత్సవ కథల పుస్తకావిష్కరణ




విశాఖపట్నం (విజయ భాను న్యూస్) : భారత స్వతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా ఆదివారం డాబా గార్డెన్స్ లోని అల్లూరి సీతారామ రాజు విజ్ఞాన కేంద్రంలో 75 మంది కవులు రాసిన 75 కవితలతో రూపొందించిన బాలల కోసం స్వతంత్ర్య అమృతోత్సవ కథల బాల కథామృతం పుస్తకాన్ని విజయ్ నిర్మాణ్ అధినేత డా. సూరప నేని విజయ్ కుమార్ ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా చిన్నారులు కవితలు, ఏక పాత్రాభినయం, నృత్య ప్రద ర్శనలు చేశారు. ఇందులో భాగంగా చల్లపిల్ల శ్యామల రాసిన మోడు చిగురించింది, కళ్ళేపల్లి స్వర్ణ లలిత రాసిన చంద్ర లేఖ పిల్లల కథలు, ప్రతాపగిరి సూర్య శ్రీకళ రాసిన నయా మూడ్, డా. సుగుణా రావు రాసిన ఆకాశంలో ఒక నక్షిత్రం వంటి శంకలనాలను అతి థులు విడుదల చేశారు. బాల బాట బాలల సంస్థ అధినేత్రి కొళ్లూరు వెంకట రమణమ్మ అధ్యక్షత వహించిన సభలో కథా రచయితలు డా. ఎం. సుగుణా రావు, మంగు శివ రామ కృష్ణ, సినీ దర్శకులు జివి త్రినాదరావు, ఫాక్ట్ అధ్యక్షుల పివిఆర్ కుమార్ రావు, గాయని అంట్యాకుల సత్యమాధవి, ఛాయా గ్రహకుడు బి. శ్రీనివాస్, వ్యాఖ్యాతలు కె. రామ జగన్నాద్, కె.జోషిత తదితరులు పాల్గొన్నారు. ... -చెన్నా

# జెడ్పీ వైస్ చైర్మన్ ఛాంబర్ ప్రారంభం



సబ్బవరం (విజయభాను న్యూస్) : మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సబ్బవరం జెడ్ పి టి సి, జెడ్ పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు కు కేటాయించిన ఛాంబర్ ను స్థానిక ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన తుంపాల అప్పారావు దంపతు లను ను అభినందించి ఘనంగా సత్కరించారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే అదీప్ రాజ్ మాట్లాడుతూ మండల అభివృద్ధి లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను జెడ్పీ వైస్ చైర్మన్, స్థానిక ఎంపీపీ బోకం సూర్యకుమారి ప్రజల్లోకి తీసుకెళ్లి అభివృద్ధిలో భాగ స్వాములు గా ఉండాలన్నారు. మండల ప్రజాప్రతినిధులంతా సమిష్టి గా ఉండి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. అనంతరం జెడ్ పి వైస్ చైర్మన్ దంపతులకు పలువురు ప్రముఖులు సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు,ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, వైస్ ఎంపీపీ లు శరగడం ఝాన్సీలక్ష్మి రాము, చొక్కాకుల గోవింద, వైసీపీ నేతలు కోటాన రాము, సబ్బవరపు నారాయణ మూర్తి, వడ్డాది అప్పలరాజు, కాపుశెట్టి శేషు బాబు, పల్లా కృష్ణ, సాలాపు వెంకటేశ్వరరావు, విరోతి చిన అప్పలనాయుడు,కర్రి బాబు, యడ్ల నాయుడు, బలిరెడ్డి కనకరాజు, కోడిగుడ్ల దేవి సాంబ,ఉగ్గిన గంగునాయుడు,గవర రాజు పలువురు ఎంపీటీసీ లు, సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# 1.38 కోట్లు తో

# జలజీవన్ మిషన్ ఇంటింటికి కుళాయి పనులకు శంకుస్థాపన



సబ్బవరం (విజయభాను న్యూస్) : మండల కేంద్రంలో సబ్బవరం -1 పరిధిలోని ప్రజలకు త్రాగునీటిని అందించడానికిజలజీవన్ మిషన్ పథకంలో ఇంటింటికి కుళాయి పనులకు స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ సోమవారం శంఖుస్థాపన చేసారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకంలో 1. 38 కోట్లు తో పేదలకు ఇంటింటికి కుళాయి కనెక్షన్ లు ఇవ్వడానికి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దీనితో సబ్బవరం-1 ప్రాంత వాసులకు త్రాగునీటి సమస్య లేకుండా ఉంటుం దన్నారు. అంతకు ముందు సాయినగర్ కాలనీ లో 14వ ఆర్థిక సంఘ నిధులు 14.64 లక్షలతో బోకం సత్యనారాయణ ఇంటి నుండి కర్రి రాంప్రసాద్ ఇంటివరకు నిర్మించిన సిసి రోడ్డు ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్ పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, ఎంపీపీ బోకం సూర్యకుమారి, రామునాయుడు, వైస్ ఎంపీపీలు శరగడం ఝాన్సీ లక్ష్మి రాము, చొక్కాకుల గోవింద్,కోటాన రాము, సబ్బవరపు నారాయణ మూర్తి కర్రిబాబు, సర్పంచ్ డి. ప్రసాదరావు, ఉప సర్పంచ్ ఎం. లక్ష్మణరావు, వై. రాము, గవర శ్రీనివాసరావు, ధనిమిరెడ్డి శ్రీనివాసరావు,వడ్డాది అప్పల రాజు, యడ్ల నాయుడు, టి శేఖర్, బంతికోళ్ల పద్మ. తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### పెనుసవాలుగా పర్యావరణం

వ్యవసాయం-పర్యావరణ యూనిట్‌గా స్థానిక సాంకేతిక పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆహార, పోషక వ్యవస్థల్లో నష్టాలను నివారించాలి. పంటల మార్పిడి, జీవ సేంద్రియ ఎరువులు, జీవ నియంత్రణ పద్ధతులు, పర్యావరణ వ్యవస్థతో ఇమిడ్చి, ఆధునికతను జోడించడం ద్వారా వ్యవసాయాన్ని సుస్థిరపరుచాలి. భూమి ఆరోగ్య పరిరక్షణ, నీటి సంరక్షణ, భూసారం పెంపొందింపు, నేల కోతను నివారించటం ద్వారా ఉత్పాదకతను పెంచడం దీర్ఘకాలిక లక్ష్యంగా ఎంచుకోవాలి. పర్యావరణ మార్పులను ఎదుర్కొనేందుకు కేవలం భారత్ అనుకుంటేనే కాదు, స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సమగ్ర కార్యాచరణ అవసరం. కోపెన్ హాగెన్ సదస్సులో నిర్ణయించినట్లుగా ఉద్గారాలను తగ్గించటం ద్వారా ఉష్ణోగ్రత పెరుగకుండా భారత్ కృషిచేయాలి. పర్యావరణ మార్పులకు అనుకూల విధానాలను రూపొందించుకుంటూనే, అభివృద్ధి చెందిన దేశాలు కార్బన్ ఉద్గారాల విడుదలకు మూల్యం చెల్లించేవిధంగా ఒత్తిడి తెస్తేనే పర్యావరణం పరిరక్షించబడుతుంది. పర్యావరణ మార్పులు వ్యవసాయంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఫలితంగా ఆహారభద్రతపై నీలినీడలు అలుముకున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పటికే యుద్ధ ప్రాతిపదికన హరితహారంతో మొక్కలు వనాల పెంపకం చేపట్టింది. అనావృష్టిని ఎదుర్కొనేందుకు చెరువుల పునరుద్ధరణ దాదా పు పూర్తయ్యింది. పంటల వైవిధ్యీకరణకు బాటలువేసింది. దీంతో పర్యావరణ మార్పులు విపరీతంగా చోటు చేసుకున్న ప్పటికీ, సాగును సజావు గా సాగించేందుకు సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తున్నది. ఒక్క మాట లో చెప్పాలంటే, పర్యావరణ మార్పులను తట్టుకునేందుకు, తెలంగాణ ప్రభుత్వం ముందస్తుగానే తయారైందని తెలుస్తున్నది. వాతావరణ మార్పులతో అభివృద్ధి దేశాల్లో ఆహారధా న్యాల ఉత్పత్తి తరిగిపోతున్నది. మరో రెండు సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత పెరిగి తే దేశంలో ప్రధాన ఆహారపంట వరి ఉత్పాదకత హెక్టారుకు ఒక టన్ను తగ్గిపోనున్నది. 2050 నాటికీ ఒక్క డిగ్రీ ఉష్ణోగ్రత పెరిగినా, దేశంలో మరో ప్రధాన ఆహారపంట గోధుమ ఉత్పాదకత తగ్గిపోతుంది. సాగుకు అనుకూల భూమి తగ్గిపోనున్నది. ప్రస్తుతం సాగు చేస్తున్న పంటరకాలు సాగుకు పనికిరావు. ఏడాదికి ఒక్క మన దేశంలోనే దాదాపు 70 లక్షల టన్నుల మేర ఉత్పత్తి పడిపోనున్నది. దీనికితోడు ఆకస్మిక వరదలు, వర్షాల లేమి సంభవించనున్నాయి. 2009లో సంభవించిన అననుకూల వర్షాభావ పరిస్థితుల వల్ల, ఒక కోటి 50 లక్షల టన్నుల వరి, 40 లక్షల టన్నుల ఇతర ఉత్పత్తి పడిపోయింది. పర్యావరణ మార్పుల వల్ల, అసాధారణ పరిస్థితులు భారత వ్యవసాయంలో చోటుచేసు కుంటున్నాయి. అసాధారణ వాతావరణ పరిస్థితులున్న దేశాల్లో భారత్ ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉన్నది. ఒక్క 2015లోనే దేశంలో 15 రాష్ట్రాలు వీటి ప్రభావాన పడితే, దాదాపు 33 శాతం పంటల సాగు విస్తీర్ణం దెబ్బతిన్న ది. ఇరువై వేల కోట్ల రూపాయల పైనే రైతులు నష్టపోయారు. పంటల బీమా లాంటి పథకాలతో ఆదుకుంటే తప్ప, రైతు సాగులో నిలబడలేరని భారత హరితవిప్లవ పితామహులు స్వామినాథన్ గుర్తుచేయాల్సి వచ్చిం ది. ఇది దేశ ఆహారభద్రతకు ప్రత్యక్ష హెచ్చరిక. ఎంత త్వరగా పరిష్కారం వెతికితే, అంత త్వరగా దేశం, ఆహార భవిష్యత్తు భద్రంగా ఉంటుంది. తెలుగు రాష్ట్రాలకు మరిన్ని పర్యావరణ సవాళ్లు పొంచి ఉన్నట్లు ప్రపం చబ్యాంకు షాక్ వేవ్స్' నివేదిక తెలుపుతున్నది. పర్యావరణ మార్పుల ప్రభావాన్ని గత 25 ఏండ్లలో అధ్యయనంలో 14 శాతం ప్రజలు పేదరి కం నుంచి బయటపడితే, ఏడాదికి సరాసరిన 12 శాతం ప్రజలు మళ్లీ పేదరికంలోకి నెట్టివేయబడుతున్నారు. ఎండల తీవ్రత, వర్షాల లేమి వల్ల, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గత 25 ఏండ్లలో 15 వేల మందికి పైగా పేదలు చనిపోయారు. ప్రపంచంలో సూడాన్ దేశం తర్వాత, అత్యధిక మరణాలు జరిగినయి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే. 2030 నాటికీ ఐదు శాతం మేర ఆహారధాన్యాల ఉత్పత్తి పడిపోతుంది. దీంతో పేదరికం పెరుగనున్నది. 2030 నాటికీ పేదరిక నిర్మూలన చర్యలు చేపట్టకపోతే, పేదరికం 30 శాతానికి చేరుకోనున్నది. కరువు, నీటికొరత, తద్వారా పంట నష్టాల వల్ల పంటల దిగుబడులు తగ్గి ఆహారకొరత పెరగనున్నదని నివేదిక తెలిపింది.

## వైకాపా ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం




విశాఖపట్నం(విజయభాను న్యూస్): జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి కార్పొరేటర్లు తో విశాఖ పార్లమెంటరీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు జీవియంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశామయ్యారు.ఈ సమావేశంలో వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని నిర్ణయించారు. చెత్త పన్ను విధానాన్ని వెంటనే రద్దు చేయాలి, ప్రోటోకాల్ ఉల్లంగించిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. వెహికల్స్ ఉండగా వాటికీ రిపేర్ చేయకుండా కొత్త వెహికల్స్ ఎందుకు?, మెకానికల్ విభాగంలో జరుగుతున్న అవినీతి.ఇలా అనేక ప్రజా వ్యతిరేక విధానాలు పై పోరాటం చేయనున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, గాడు చిన్ని కుమారి లక్ష్మి అప్పలనాయుడు, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, బొండా జగన్, మద్దిల రామలక్ష్మి రాజ శేకర్,గొలగాని మంగ వేణిపోలారావు , ముక్కా కిషోర్, శరగడం రాజశేఖర్, గల్లా చిన్న ,దాడి వెంకట రమేష్ , బొమ్మిడి రమణ, బల్ల శ్రీను , రాపేటి కన్నా ,సేనాపతి వసంతా శంకరరావు నాయకులు పాల్గొన్నారు.

## రింగు వలల సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

### మత్స్యకార సంఘాలు కమిటీ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలి

### జాయింట్ కలెక్టర్ కే ఎస్ విశ్వనాథన్




విశాఖపట్నం(విజయభాను న్యూస్): రింగు వలల సమస్యను మత్స్యకారులందరూ సామరస్యంగా పరిష్కరించుకోవాలని జాయింట్ కలెక్టర్ కే ఎస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హల్ నందు ఇరువర్గాల మత్స్యకార సంఘాలతో సమావేశం నిర్వహించారు. మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఆదేశాల మేరకు ఇరు వర్గాల మత్స్యకార సంఘాలతో సమావేశం నిర్వహించారు. వేటకు సంబంధించి పలు అంశాలపై సంఘాల సభ్యుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఇరువర్గాల సంఘాల నుండి ప్రతిపాదించిన సభ్యులతో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటుకు నిర్ణయించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రింగ్ వలలు తో సాగర్ నగర్ హద్దుగా నిర్ణయించి , అది దాటి మాత్రమే రింగు వలలతో వేట కొనసాగించాలని ఆదేశించారు. రింగ్ వలలతో వేట వచ్చే సంవత్సరం వేట నిషేధ సమయం (ఏప్రిల్ 15 )వరకు మాత్రమే అనుమతి ఇస్తున్నట్లు ప్రకటించారు. రింగ్ వలలు యొక్క మొత్తం వివరాలు మత్స్య శాఖ, పోలీస్ సిబ్బంది సహకారంతో సేకరిస్తామని పేర్కొన్నారు. ప్రతి నెలా ఈ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మత్స్యకారులు తమ సమస్యలను ఈ కమిటీకి తెలియజేయాలని అన్నారు. మోటార్ కలిగిన బోటులను సాంప్రదాయ వేట బోటులుగా పరిగణించేందుకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని తెలిపారు. మత్స్య శాఖ అడిషనల్ డైరెక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ బోటులు, వలలు తగలబెట్టడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని మత్స్య కారులకు సూచించారు. సమస్య పరిష్కారానికి పోలీసులకు, సంఘాల నాయకులకు తెలపాలని కోరారు. ఈ సమావేశంలో ఇరు వర్గాల మత్స్యకార సంఘాల నాయకులు, ,మత్స్యకారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## కవి సమయం

### డబ్బుకు లోకం దాసోహం

డబ్బు జబ్బు భలే ప్రమాదం
లోకమంతా డబ్బు చుట్టునే పరిభ్రమణం
డబ్బు తోనే జీవితమన్న భావన
డబ్బుంటేనే విజయమన్న ఆలోచనా ధోరణి
మానవులను మార్చేస్తోంది డబ్బు యంత్రాలుగా
అనుక్షణం డబ్బే లోకంగా బ్రతుకుతుంటే
మానవతా విలువలు, మమతానుబంధాలు
ఆప్యాయతలు, కుటుంబ విలువలు
అన్నీ అవుతున్నాయి సమాధి
డబ్బుకు లోకం దాసోహం
కాగితాల వెనుక మానవుల
స్వస్వరూపం మటుమాయం
నైతిక విలువలకు త్రిలోదకాలిచ్చి
అక్రమ మార్గాల వెంట సంపాదన బహు ప్రమాదం
ప్రతీ పైసా వెయ్యింతల కష్టాన్ని
వసూలు చేసి మరీ వెళుతుంది
సక్రమ మార్గమందు న్యాయార్జితం
లక్ష రెట్లు సుఖాన్ని తృప్తిని ఇస్తుంది
క్షణిక లోభాలకు తలొగ్గి
పేరాసతో డబ్బుకు కక్కుర్తి పడితే
అధ:మ పాతాళానికి పతనం

... కవిత రచన
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : శ్రావణ : తిథి : ద్వాదశి ప.2.54; మూల ఉ.10.22; ఉ.వ.8.52ల 10.22. | మంగళవారం 09-08-2022

a **మేషం** : బంధువులను కలుసుకుంటారు. స్త్రీలకు షాపింగ్‌లోనూ, వాహనం నడుపుతున్నపుడు ఏకాగ్రత ముఖ్యం. రావలసిన ధనం వసూలు విష యంలో శ్రమాధిక్యత, ప్రయాసలెదుర్కొంటారు. నూతన పరిచయాలు, వాతావరణం సంతృప్తి నిస్తాయి. b **వృషభం** : బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కో వలసి వస్తుంది. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు కలిసివస్తాయి. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు, ఒప్పందాల్లో మెలకువ వహించండి. C **మిథునం** :స్త్రీలకు, గృహ వాతావరణం, సంతానం వైఖరి వల్ల చికాకులు తప్పవు. కళాకారులకు, క్రీడాకారులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. పలుకుబడి కలిగిన వ్యక్తుల పరిచయం వల్ల పనులు అనుకూలిస్తాయి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం మంచిది కాదు. d **కర్కాటకం** :విదేశీ వస్తువుల పట్ల ఆకర్షితులవుతారు. ప్రముఖులను కలుసు కుంటారు. బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. మీ సంతానం ఉన్నతి కోసం కొత్తకొత్త పథకాలు రూపొందిస్తారు. స్త్రీలలో ఒత్తిడి, హడావుడి అధికమవుతాయి. e **సింహం** : పోస్టల్, కొరియర్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికమవుతుంది. నిరుద్యోగులకు సదావకాశాలు లభించిన సద్వినియోగం చేసుకోలేరు. ఉపాధ్యాయులకు పై అధికారుల నుంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. f **కన్య** : కొంతమంది మీతో సన్నిహితంగా ఉంటూనే చాటుగా అపకారం తలపెట్టేందుకు యత్నిస్తారు. చిన్ననాటి మిత్రులను, ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. స్థిరాస్తిని కొనుగోలుచేయు యత్నాలు ఫలిస్తాయి. పనులు మొదట్లో మందగించినా క్రమేపీ పూర్తికాగలవు. కుటుంబీకులతో దైవ దర్శనాలు చేసుకోగలగుతారు. g **తుల** : కాంట్రాక్టర్లకు కార్మికులతో సఖ్యత నెలకొంటుంది. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. భాగస్వామి మాటతీరు, కదలికలను గమనించడం ఎంతైనా మంచిది. h **వృశ్చికం** : ఆర్థిక లావాదేవీలు, ఒప్పందాల్లో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. వృత్తిపరంగా ఎదుర్కొంటున్న ఆటంకాలు క్రమంగా తొలగిపోగలవు. ఒక్కోసారి మీ జీవిత భాగస్వామి మనస్తత్వం అర్థం చేసుకోవడం కష్టమవుతుంది. సభలు, సమావేశాలల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. i **ధనుస్సు** : ఫ్యాన్సీ, స్టేషనరీ, రసాయన, సుగంధ ద్రవ్య వ్యాపారులకు శుభదాయకం. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి. ఆకస్మిక ఫీజులు, బిల్లులు చెల్లిస్తారు. పట్టుదలతో శ్రమించి అనుకున్నది సాధిస్తారు. సోదరీ, సోదరులతో ఉల్లాసంగా గడుపుతారు. కుటుంబీకుల ఆరోగ్యంలో మెళకువ అవసరం. j **మకరం** : ఆర్థిక కార్యకలాపాలు సానుకూలంగా సాగుతాయి. మీ సంతానం మొండివైఖరి వల్ల చికాకులు వంటివి ఎదుర్కొంటారు. ఫైనాన్స్ వ్యాపారస్తులకు ఖాతాదారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. నిరుద్యోగులకు తాత్కాలిక అవకాశం లభిస్తుంది. పెద్దలతో కుటుంబ విషయాలు చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటారు. k **కుంభం** :కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. నిరుద్యోగులకు రాత, మౌఖిక పరీక్షల్లో ఏకాగ్రత ముఖ్యం. కుటుంబ విషయాల్లో స్త్రీలకు పట్టుదల, పంతాలు మంచిది కాదు. ఉద్యోగస్తులకు హోదాతో పాటు బరువు బాధ్యతలు పెరుగుతాయి. ఉపాధ్యాయు లకు పనిభారం అధికమవుతుంది. L **మీనం** : గృహంలో మార్పులు, చేర్పులు అనుకూలమైన కాలం. బ్యాంకు డిపాజిట్లు, దీర్ఘ కాలిక పెట్టుబడులకు అనుకూలం. సోదరీ, సోదరుల మధ్య ఏకీభావం కుదరదు.

# యుగాలు విలువలుచాటే యాగాలు

## సంకీర్తన



**యాగాల్లో రకాలు...**
**అశ్వమేధ యాగం,**
**సర్ప యాగం,**
**రాజసూయ యాగం,**
**పుత్రకామేష్టి యాగం,**
**శ్వజిత్ యాగం, వరుణయాగం.**

యజ్ఞం లేదా యాగం ఒక విశిష్టమైన హిందూ సంప్రదాయం. భారతదేశంలో పురాణకాలం నుంచి వివిధ రకాలైన యజ్ఞాలు జరిగాయి. దేవతలకు తృప్తి కలిగించం యజ్ఞం లక్ష్యం. సాధారణంగా యజ్ఞం అనేది అగ్ని (హోమం) వద్ద వేదమంత్రాల సహితంగా జరుగుతుంది. ఇందుకు అనుబంధంగా అనేక నియమాలు, సంప్రదాయాలు ఉన్నాయి. అగ్ని హోత్రం అనేది యజ్ఞంలో ముఖ్యమైన అంశం యజంలో ఒకటిగాని అంతకంటే ఎక్కువగాగాని హోమాగ్నులు ఉంటాయి. ఆ అగ్నిలో నెయ్యి,పాలు ధాన్యం, వంటివి పోస్తుంటారు.

**అశ్వమేధ యాగం :**

అశ్వమేధ యాగం వేద కాలం నుంచి వస్తున్న రాజ సాంప్రదాయాలలో అతి ముఖ్యమైనది. ఈ యాగము వివరముగా యజుర్వేదములో చెప్పబడినది. ఋగ్వేద ములో గుర్రపు బలి గురించి, శ్లోకాలలో కొంత ప్రస్తావన ఉన్నా, యజుర్వేదములో చెప్పినంత వివరముగా చెప్పబడిలేదు. గాయత్రీ పరివార్ 1991 నాటి నుంచి జంతు బలి లేకుండా, అశ్వ మేధ యజ్ఞాన్ని ఆధునిక శైలిలో నిర్వహిస్తున్నారు. అశ్వమేధ యాగాన్ని కేవలం రాజ వంశానికి చెందిన వారు మాత్రమే చేయాలి. ఈ యాగం ఉద్దేశ్యం ఇరుగు పొరుగు దేశాల రాజ్యాల పై ఆధిపత్యాన్ని తెలుపడం తమ రాజ్యం యొక్క గొప్పతనాన్ని చాటుకోవడం. ఈ యాగంలో దృడంగా ఉండే 24 నుంచి 100 సంవత్సరాల మధ్య వయసు గల మేలు జాతి మగ గుర్రాన్ని మాత్రమే వాడతారు. గుర్రాన్ని మంత్ర జలంతో శుద్ధి చేశాక, ఋత్వికులు దాని చెవిలో మంత్రాలను పఠిస్తారు. ఎవరైనా ఈ గుర్రాన్ని ఆపబోయే వారికి శాపాలను ఇస్తూ, ఒక కుక్కను చంపి సంకేతికంగా శిక్షను తెలియచేస్తారు. ఆ తర్వాత గుర్రాన్ని ఒక సంవత్సరరకాలం (కొంతమంది అర్థ సంవత్సర కాలమని చెపుతారు) యధేచ్ఛగా తిరగడనికి ఈశాన్య దిశగా వదిలేస్తారు. ఈ గుర్రాన్ని సూర్యునితోనూ, సూర్యుని సాంవత్సరిక గమనముతోనూ పోలుస్తారు. అశ్వము శత్రు రాజ్యంలో సంచరిస్తే నిర్వాహకుడు ఆ శత్రు రాజ్యాన్ని ఆక్రమించుకుంటాడు. గుర్రాన్ని ప్రతీ ఆపద, ఇబ్బందుల నుంచి కాపాడడానికి తోడుగా రాజ కుమారులు కాని సేనాధిపతులు గాని ఉంటారు. నిర్వాహకుని ఇంట్లో ఈ గుర్రం తిరిగే కాలంలో యజ్ఞ యాగాదులు జరుపుతారు.

గుర్రం తిరిగి వచ్చాక మరికొన్ని ఆచారాలను పాటిస్తారు. మరి మూడు గుర్రాలతో ఈ అశ్వాన్ని బంగారు రథానికి కాడి వేసి కట్టి ఋగ్వేదాన్ని పాటిస్తారు. ఆ తర్వాత గుర్రాన్ని స్నానమాడించి, మహారాణీ, తన పరిచారకులు గుర్రాన్ని నేతితో అభ్యంగనమాచరిస్తారు. మహారాణీ ముందు కాళ్లను, పరిచారకులు కడుపు భాగాన్ని, వెనుక కాళ్లను అభ్యంగనమాచరిస్తారు. అశ్వము తల, మెడ, తొకలను బంగారు ఆభరణములతో అలంకరిస్తారు. నిర్వాహకుడు గుర్రానికి రాత్రి నైవేద్యాన్ని సమర్పిస్తాడు. ఆ తర్వాత గుర్రాన్ని, ఒక కొమ్ములులేని మగ మేకను, ఒక గోమృగాన్ని (అడవి బర్రె)ని అగ్ని గుండానికి దగ్గరగా బలి పీఠానికి కట్టి వేస్తారు. ఇంకా 17 జంతువులను గుర్రానికి కడతారు. ఇంకా చాలా పెంపుడు అడవి జంతువులను (ఒక వ్యాఖ్యాత ప్రకారం మొత్తం 609 జంతువులు) వేర్వేరు బలి పీఠాలకు కట్టి వేస్తారు.అప్పుడు ఆ గుర్రాన్ని బలి చేస్తారు.

## పరవాడ నూతన తహశీల్ధార్ గా ప్రకాష్ రావు బాధ్యతలు స్వీకరణ



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ నూతన తహశీల్దార్ గా వి.ప్రకాష్ రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఈయన గతంలో పాడేరు తుహశీల్దార్ గా విధులు నిర్వర్తించి బదిలీపై పరవాడ విచ్చేశారు. పరవాడలో ఇప్పటి వరుకు తహశీల్దార్ గా విధులు నిర్వర్తించిన బివి రాణి చీడికాడ బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా నూతన తహశీల్దార్ వి.ప్రకాష్ రావు స్దానిక విలేఖర్లుతో మాట్లడుతూ ప్రభుత్వ భూములు పరిరక్షణకు కృషి చేస్తాను అని తెలిపారు.

మండలములో గెడ్డలు, వాగులు, ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదు అని ఈ సందర్భంగా తహశీల్దార్ వి.ప్రకాష్ రావు హెచ్చరించారు.

# కనీస సౌకర్యాలు లేని గిరిజన గ్రామాలు



అనంతగిరి (విజయభాను న్యూస్) : అనంతగిరి, ప్రభుత్వాలు అధికారులు ,మారుతున్న కొన్ని గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు పెడబిడ్డ పంచాయితీ బందవలస గ్రామంలో సుమారు 25 కుటుంబల గిరిజనులు జీవనం సాగిస్తున్నారు పంచాయితీ కేంద్రనికి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం ఉంట్టుంది గ్రామానికి రహదారి సదుపాయం లేదు అత్యవస పరిస్థితి లో గర్భిణులు రోగగస్థులు ఆసుపత్రికి వెళ్లాలన్న రహదారి సదుపాయం లేక 108 వాహనం వెళ్ళడానికి అవకాశం లేనందున గిరిజనులు నాన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అలాగే గ్రామంలో తాగునీరు సౌకర్యం లేనందున ఊట గెడ్డ నీటినే ఆధారపడాల్సి పరిస్థితి నెలకొంది వర్ష కాలం బురద నీటినే తగాల్సిన అవసరత ఏర్పడుతుందని గ్రామస్థులు పట్టం కృష్ణ పట్టం లక్ష్మణరావు సన్యాసిరావు విలేకరులతో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తంచేశారు ఇప్పటికైన ప్రజాప్రతినిధులు అధికారులు స్పం దించి వెంటనే రహదారి తాగునీరు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## గడప గడపకు జాతీయ పతాకాన్ని పంచిన వైకాపా నాయకులు



గడప గడపకు వైకాపా ప్రచారంలో భాగంగా ఆజాదీ కి అమృత్ మహోత్సవం సందర్భంగా 38 వ వార్డు చిన రాజప్ప వీధిలో వార్డు అధ్యక్షుడు సన్యాసిరావు లతో పాటు సురేష్, కిషోర్, కోసూరు సురేష్ లు పాల్గొని టౌన్ హాల్ సచివాలయ సిబ్బంది తో ఇంటి ఇంటికీ జాతీయ పతాకాన్ని పంచడం చేశారు.

## దివిస్ లో అజాద్ కా అమృత్



భీమునిపట్నం (విజయభాను న్యూస్) : 75 వ స్వాతంత్ర్య సందర్భంగా భారత ప్రభుత్వం పిలుపు మేరకు అజాద్ కా అమృత్ ఉత్సవాలను సోమవారం దివిస్ లేబరేటరీస్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దివిస్ జనరల్ మేనేజర్ ఎం ఎస్ ఎన్ రావు మాట్లాడుతూ అనేక త్యాగాలతో పోరాటాలతో స్వాతంత్ర్యన్ని సంపాదించి 75 సంవత్సరాల స్వయం పాలనలో అప్రతిహతంగా ముందుకు సాగుతున్న భారతావని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు స్వాతంత్ర్య పోరాట సమరంలో జరిగిన సమరం త్యాగం కొత్త తరాలకు తెలియజేసి దేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పాలన్నారు.

ఈ సందర్భంగా నైపుణ్య అభివృద్ధి కేంద్రం నుండి జెండాలతో ప్రదర్శన చేశారు. దేశ భక్తి గీతాలు స్ఫూర్తి రగిలించే సాం స్కృతిక ప్రదర్శనలను నైపుణ్య అభివృద్ధి కేంద్రం లోని విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో దివిస్ సిబ్బంది ఈఎస్ నాగరాజు, కె. నరసింహారావు, ఎన్. బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నూకాంబికా అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పంచకర్ల



పరవాడ (విజయభాను న్యూస్) : పెందుర్తి నియోజక వర్గం జీవీఎంసీ 92వ వార్డులో పద్మనాభ నగర్ లో జరిగే శ్రీ శ్రీ శ్రీ నుకాంబిక అమ్మ వారి విగ్రహ ప్రతిష్ట కు నిర్వహకులు పిలుపుమేరకు జననేత పెందుర్తి మాజీ శాసన సభ్యులు పంచకర్ల రమేష్ బాబు హజరైన్నారు. అనంతరము నూకాంబికా అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీశ్రీశ్రీ నూకాంబికా అమ్మవారి అశీ స్సులు పెందుర్తి నియోజక వర్గంలో ప్రజలు పైన ఉండా లని అకాక్షిస్తూ అమ్మవారికి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచకర్ల అబిమానులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ కు గుర్రై తల్లి కొడుకు మృతి



దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : విద్యుత్ షాక్ కు గుర్రై తల్లి, కొడుకు మృతి సంఘటన దేవరాపల్లికి సమీపంలోని సంజీవ మెట్ట గ్రామంలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో కరక సత్యనారాయణ ( 50) అనే రైతు పొలంలో బోరు వద్దకు వెళుతుండగా పొలములో విద్యుత్ స్తంభం ఎర్త్ వైర్ తగలడంతో విద్యుత్ షాక్ గురయ్యాడు.ఎంత పిలిచిన కొడుకు రాకపోవడంతో మృతుడి తల్లి సింహాచలం, (70)వెళ్లడంతో ఆమె కూడా విద్యుత్ షాక్ గుర్రై మృతి చెందారు. వెంటనే కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ కి ఫోన్ చేసి అంబులెన్స్ లో దేవరాపల్లి పీ హెచ్ సి కి తరలించారు. స్థానిక వైద్యాధికారి లలితా పరీక్షించి ఇద్దరు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు,పెద్ద కుమార్తె శ్రావణి కి గతంలో వివాహం జరిగింది. రెండవ కుమార్తె పావనీకి ఈనెల 11న వివాహం జరగనుంది. ఈమెను నర్సీపట్నం మండలం అన్నవరం గ్రామానికి చెందిన అబ్బాయికి వివాహం నిశ్చయమైంది. ఈనెల 11న అన్నవరం సత్యనారాయణమూర్తి కొండపై వివాహం జరగబోతుంది. ఇంతలో ఈ సంఘటన చోటు చేసుకోవడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మూడు రోజుల్లో వివాహం గురించి అన్ని ఏర్పాట్లు చేసుకున్న తరువాత ఈ ఘటన జరగడం దురదృష్టకరమని స్థానికులు విచారం వ్యక్తం చేశారు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయనగరం జిల్లా వేపాడ ఎస్సై కె.రాజేష్ కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఎస్.కోట తరలించారు.

## నేడు పెదనందిపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

### - హాజరుకానున్న డిప్యూటి సీఎం బూడి ముత్యాల నాయుడు



దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : మండలంలోని పెదనందిపల్లి గ్రామంలో మంగళ వారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి లుగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి వర్యులు బూడి ముత్యాల నాయుడు హాజరవుతారన్నారు. ఆయనతో పాటు విశాఖ ఉమ్మడి జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్, కె .కోటపాడు జెడ్పీటీసీ ఈర్లే అనూరాధ , మండల పరిషత్ అధ్యక్షులు కిలపర్తి రాజేశ్వరి భాస్కర రావ , జెడ్పీటీసీ కర్రి సత్యం పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, దేవరాపల్లి మండల వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీ టీసీలు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు,కోపరేటివ్ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



ములగాడ (విజయభాను న్యూస్): జీవీఎంసీ 61 వ వార్డు రామకృష్ణాపురం లో కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో రూ 9 లక్షల రూపాయల విలువచేసే సీసీ రోడ్డు నిర్మాణము నకు. శంకుస్థాపన చేశారు.

సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా పశ్చిమ నియోజకవర్గం ఆడారి ఆనంద్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే ప్రధాన లక్ష్యయంగా జగనన్న ప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో... వైకాపా నాయకులు శెట్టి నూకరాజు, పిలక రామ్మోహన్ రెడ్డి, సోను, పోలమర శెట్టి జగ్గారావు, స్వప్న, బొడ్డేటి సత్యవతి, ప్రకాష్, బాబురావు, సచివాలయం సిబ్బంది, వార్డు నాయకులు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సత్యదేవునికి నిత్య కైంకర్య వెండి వస్తువులు వితరణ



అన్నవరం (విజయభాను న్యూస్) : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారికి అన్నవరం గ్రామ కాపురస్తులు స్వతంత్ర సమరయోధులు కీ.శే. వింజమూరి.గోపాల కృష్ణమాచార్యులు గారి పేరున వారి శ్రీమతి వింజమూరి.ఆండాలమ్మ శ్రీ స్వామివారి నిత్య కైంకర్యము లలో ఉపయోగించు నిమిత్తము సుమారు 1కేజీ 45 గ్రాముల బరువు గల వెండి పళ్లెం,వెండి శఠారి,మూడు పంచ పాత్రలు,మూడు ఉద్ధరిణిలు విరాళముగా సమర్పించారు.ఈ కార్యక్రమంలో వీరి కుమారుడు వింజమూరి.బదరీ కృష్ణ,శ్రీమతి ఇందుమతి దేవి మరియు సూపరింటెండెంట్ అనకాపల్లి ప్రసాద్,నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాల బలోపేతానికి నూతనంగా ఎన్నికైన సంఘం చైర్మన్లు కృషి చేయాలి

### ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్



ఐ పోలవరం (విజయభాను న్యూస్) : సహకార సంఘాల బలోపేతానికి నూతనంగా ఎన్నికైన సంఘం చైర్మన్లు కృషి చేయాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పేర్కొన్నారు. ఐ.పోలవరం మండలం పరిధిలోని తిళ్లకుప్ప సహకార సంగం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చైర్మన్ గా ఉండ్రు వెంకటేశ్వరావు, డైరెక్టర్లుగా కోట్నాల ముత్యాలు, కొప్పిశెట్టి వీరం శెట్టి లతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం స్థానిక సర్పంచ్ కడియం తమ్మయ్య తో కలిసి నూతన చైర్మన్ వెంకటేశ్వరరావు మీడియా సమావేశంలో మాట్లాడారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సొసైటీ సిబ్బంది, సర్పంచులు, ఎంపిటిసిలు గ్రామ ప్రజలు పూల మాలలు, శాలువాలతో వెంక టేశ్వరరావును ఘనంగా సత్కరించి అభినంద నలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోర్త మిరియం జ్యోతి, జెడ్ పి టి సి ముదునూరి సతీష్ రాజు, మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతిరాజు, ఢిల్లీ నారాయణ తదితరులు పాల్గొన్నారు..

## సీపీఎస్ రద్దు హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి



గాజువాక (విజయభాను న్యూస్): జీవీఎంసీ శ్రీహరిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సిబ్బంది అంతా ఎ పి టి ఎఫ్ 257 పిలుపుమేరకు వంద రోజుల ప్రోగ్రాం భాగంగా పోస్టు కార్డు ఉద్యమం చేపట్టటం జరిగింది. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో సి పి ఎస్ రద్దు విషయం లో సిఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని విశాఖ అర్బన్ సెక్రటరీ ఎం ఎస్ ప్రకాష్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాకాలకు గుర్తింపు సరిఫికెట్ అందజేసిన మోహంతి



పరవాడ (విజయభాను న్యూస్) : ఇటీవలే గోదావరి వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలకు తనదైన శైలిలో సాయంచేస్తూ పేదలు పట్ల ఐటీసి కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్ మానవత్వం చాటుకున్న సంగతీ అందరికీ తెలిసిందే. ఈ మేరకు పాకాల దుర్గా ప్రసాద్ కు గుర్తింపు సర్టిఫికెట్ ను ఐటీసి హెడ్ మోహంతి అందజేసారు. ఈ సందర్భంగా గొదావరి వరదల్లో దుర్గాప్రసాద్ చేసిన సేవలును కొనియాడారు.

# రేషన్ కార్డులు తీసి, పింఛన్లు తీసేసి మన్యం ప్రాంతం గిరిజనులకి అన్యాయం చేస్తున్న వైసీపీ ప్రభుత్వం

**ఇటువంటి ప్రభుత్వాన్ని ఏనాడు చూడలేదు : అనంతగిరి జనసేన పార్టీ మండల అధ్యక్షులు మురళీ**

అనంతగిరి (విజయభాను న్యూస్) : ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేనున్నాను... నేను విన్నాను... అంటూ పాదయాత్రలో అనేక హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం ఇటీవల తీసుకున్న పలు నిర్ణయాలు ప్రజలను, ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మూడు సంవత్సరాలు దాటినపాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి తిరుగులేని ప్రభుత్వంగా వైసిపి నిలచిందని ముఖ్యమంత్రి జగన్ రెడ్డి తో పాటు ఆయన మంత్రులు ఎమ్మెల్యేలు చెబుతున్నప్పటికీ గ్రామీణ ప్రాంతంలో అందుకు విరుద్ధ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా అల్లూరి మన్యం ప్రాంతంలో ముఖ్యమంత్రి జగన్ పనితీరుపై రోజురోజుకు వ్యతిరేకత పెరుగుతూ వస్తోందని అనంతగిరి మండల జనసేన పార్టీ అధ్యక్షులు సిహెచ్ మురళి అన్నారు. దీనికి కారణాలు కూడా లేకపోలేదు ఏజెన్సీ ప్రాంతంలో నిరుపేద గిరిజనుల జనాభా ఎక్కువగా ఉంది అయితే ముఖ్యమంత్రి జగన్ తన తప్పుడు నిర్ణయాలతో గిరిజన పేద ప్రజలకు ప్రాణ సంకటంగా మారుతున్నాయి. గత ప్రభుత్వం వరకు గిరిజన పేద ప్రజలు పింఛన్ కోసం రేషన్ కోసం ఎదురు చూస్తూ,. వచ్చిన రేషన్, పింఛన్, వచ్చిన తర్వాత వాటితో నెలంతా కడుపు నింపుకునే వారు. అలాగే 10 ఎకరాలు భూమి ఉన్న కుటుం బాలకు ఈ ప్రభుత్వం రేషన్ కార్డు పింఛన్ రద్దు చేసి తీవ్ర అన్యా యాన్ని గురిచేశారు. ఇప్ప టికైనా ప్రభుత్వం కళ్లు తెరచి మన్యం ప్రాంతంలో ఉన్న గిరిజను లకు న్యాయం చేయాలి అలాగే 14-15 ఆర్థిక సంఘం నిధులు లేక మన్యం ప్రాంతంలో సర్పంచ్ లు అభివృద్ధి చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా 15,వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని చిట్టం మురళీ కోరారు.



# ఎస్ఏఆర్బి వైజాగ్‌ను సందర్శించిన సామ్లో హైదరాబాద్ జనరల్ మేనేజర్ గిరిధర్ స్వామినాధన్






విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : విశాఖపట్నంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సార్చ్ బ్రాంచి (స్టెడ్ అస్సెట్స్ రికవరీబ్రాంచ్)ను నూతనంగా ఏర్పాటైన హైదరాబాద్ సామ్రా (స్టెడ్ అస్సెట్స్ మేనేజ్ మెంట్ రీజనల్ ఆఫీసు) జనరల్ మేనేజర్ గిరిధర్ స్వామినాధన్ సందర్శించారు. ఈ సందర్భంగా గిరిధర్ స్వామినాధన్ మాట్లాడుతూ దేశంలోనే సార్చ్ విభాగంలో రికవరీలలో అద్భుత ప్రతిభ కనబరుస్తూ, అత్యధిక రికవరీలు సాధిస్తున్న సార్మ్ విశాఖపట్నం బ్రాంచిని ఈ సందర్భంగా అభినందించినారు. భవిష్యత్తులోను కూడా అత్యధిక రికవరీలు సాధించాలనీ బ్రాంచ్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

ఈ పర్యటనలో భాగంగా బ్రాంచ్ ప్రాంగణంలో మొక్కలను నాటారు, తద్వారా పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటాలనీ తమ ఉద్యోగులకు కూడా తెలియజేశారు. అలాగే ఉదయం బీచ్ రోడ్డు మరియు బ్యాంక్ పరిసర ప్రాంతాలల వీధి కుక్కలకు ఆహారం అందించి తన మానవతా దృక్పధమును చాటుకున్నారు. కార్యక్రమంలో జనరల్



మేనేజర్ వెంట సార్చ్ విశాఖపట్నం ఎ.జి.యం. కె.శ్రీకిరణ్, చీఫ్ మేనేజర్లు: కె.ఎస్. హెచ్.శాస్త్రి, ఎం.మోహన్‌కుమార్, ఎన్.రమణ, డి.జి.ఎస్.ఆత్రేయ, సి.హెచ్.రవి కళాధర్ శర్మ, బి. అన్నయ్య మరియు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటుకోవాలి



దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటుకోవాలని వెలుగు ఏపీఎం ఎస్ ప్రభాకర్ రావు అన్నారు. అదేవిధంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలి అన్నారు.ఆజాదీకా అమృత్ మహోత్సవం కార్య క్రమంలో భాగంగా సోమవారం దేవరాపల్లి రామాలయం సమీపంలోని కమ్యూనిటీ స్టేజి వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది దేశ నాయకుల త్యాగ ఫలితాలను మనం అనుభవిస్తున్నామని... దేశభక్తిని చాటి చెప్పాలన్నారు. సాటి మనిషికి సాయం చేయాలన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి ఈ నెల 15వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ లెక్కల గౌరీ శంకర్, పంచాయతీ సెక్రటరీ నాగలక్ష్మి, ఏఎన్ఎం జయసుధ, వీఆర్వో నూకరాజు, వెలుగు సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# స్పందన వినతులు సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలి

**- 255 అర్జీలు స్వీకరించారు - సంయుక్త కలెక్టర్ విజయ సునీత**

శ్రీకాకుళం (విజయభాను న్యూస్) : స్పందన వినతులు సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంయుక్త కలెక్టర్ విజయ సునీత అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరణలో సంయుక్త కలెక్టర్ తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి ఉన్నారు. రీ ఓపెన్ లో లేకుండా చూడాలన్నారు, 26 రీ ఓపెన్ లో ఉన్నాయని ఇందులో రెవెన్యూ, పంచాయతీ రాజ్, మున్సిపాల్టీ, సమగ్ర శిక్ష, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, ఎక్సైజ్, పోలీసు శాఖ, తదితర శాఖలలో పెండింగ్ ఉన్నాయని, వాటిని తక్షణమే పెండింగ్ లో లేకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గారి ఆదేశించారన్నారు. బియాండ్ ఎస్ఎల్ఎ లో పెండింగ్ లో లేవన్నారు. తగిన పరిష్కారం చేయాలన్నారు.

# పిఎన్ఎం హైస్కూల్ లో విద్యార్థులుకు

## పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలు

భీమునిపట్నం (విజయభాను న్యూస్) : పండిట్ నెహ్రూ ఉన్నత పాఠశాల లో ఆజాద్ కా అమృత మహోత్సవం కార్యక్రమం లో భాగంగా పాఠశాల విద్యార్థులచే ఘర్కా తిరంగా కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమల శ్రీదేవి తెలిపారు.

ఇందులో భాగంగా విద్యార్థులుకు పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులచే స్వాతంత్ర సమరయోధుల ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ స్వాతంత్ర సమరయోధులు యొక్క జీవిత చరిత్ర గురించి డిబేట్ మరియు వ్యాస రచన పోటీలు నిర్వహించామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సత్య రాజు, భారతి, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# గీతంలో నూతన విద్యార్థుల సందడి



సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం లో ఇంజనీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, సైన్స్, లా, మేనేజ్‌మెంట్, హ్యూమానిటీస్, నర్సింగ్, పారామెడికల్ కోర్సులలో 2022-23 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సోమవారం తేది: సర్టిఫికేట్‌ల పరిశీలన, వసతి గృహాలలో ప్రవేశాలు మరియు అవగాహన తరగతులను ప్రారంభించారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన గీతం ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ర్యాంకుల ఆధారంగా వివిధ కోర్సులలో ప్రవేశాలు కల్పించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులతో విశ్వవిద్యాలయంలో సందడి నెలకొంది. విద్యార్థుల సౌకర్యార్థం హెల్ప్ డెస్కలతో పాటు బస్‌పాస్ సౌకర్యం తదితర సమాచార కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివాజి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో గీతం కేంపస్ లైఫ్ ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు విద్యార్థులను, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు. గీతం లో ప్రవేశం పొందే ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ చూపుతున్నామని, కెరీర్ గైడెన్స్ విభాగాన్ని బలోపేతం చేసామని తెలిపారు. గీతం నుంచి ఏటా 3000 వేల మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ మరియ ఎన్‌సిసి విభాగాలతో పాటు క్రీడలలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉచితంగా ఆన్‌లైన్ సర్టిఫికేట్ కోర్సులు అభ్యసించేలా "కురసెర" సంస్థతో ప్రత్యేక ఒప్పందం చేసుకున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉన్నత విద్యను అందించడం లక్ష్యంగా ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు రెండు వారాల పాటు నాయకత్వ లక్షణాలు, వ్యకిత్వవికాసం, నైతిక విలువలు తదితర అంశాలపై అవగాహన తరగతులను నిర్వహించనున్నారు.

# నిస్వార్ధ సేవతో సంతృప్తి లభ్యం!



తాటిచెట్లపాలెం (విజయభాను న్యూస్) : సమాజానికి చేతనైన రీతిలో నిస్వార్ధ సేవలను అందించటం వలన ఆత్మ సంతృప్తి కలగడంతో పాటు సంఘానికి మేలు చేకూరుతుందని సెవెన్ హిల్స్ హాస్పటల్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సి.హెచ్ వరప్రసాద్ ప్రబోధించారు. తాటిచెట్లపాలెంలో గల మాస్టర్ ఇ. కె సంస్కృతి సదన్ లో ది వరల్డ్ టీచర్ ట్రస్టు (జగద్గురుపీఠం) సెవెన్ హిల్స్ హాస్పటల్స్ సంయిక్తంగా ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించిన పిమ్మట ఆయన మాట్లాడారు. వైద్యానికి పరమావధి సేవ చేయడమేనన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా వివిధ రంగాలద్వారా సేవలనందిస్తున్న జగద్గురుపీఠం వంటి ఆధ్యాత్మిక సంస్థలతో కలిసి సేవ చేయడానికి తామెప్పుడూ సిద్ధమేని డా? వరప్రసాద్ చెప్పారు. సామాన్య జనులకు సేవల నందించాలనే మాస్టర్ పార్వతీకుమార్ కి కలిగిన సత్సంకల్పానికి నిదర్శనమే మాస్టర్ ఇ. కె సంస్కృతి సదన్ అని చింతలపాటి సత్యదేవ్ పేర్కొన్నారు చెవి, ముక్కు , నోరు సర్జన్ డా?డి. దిలీప్ కమార్ మాట్లాడుతూ క్రమశిక్షణ , శ్రద్ధలతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించడం తమకు ఆనందం కలిగించిందన్నారు. ట్రస్ట్ కార్యగర్శి బి. ఆర్. కె. రాజు మాట్లాడుతూ 1995 నుండి ఈ ప్రాంతంలో జగద్గురుపీఠం ఉచిత విద్య, హోమియో వైద్యం ద్వారా సేవలను అందిస్తుందన్నారు ట్రస్ట్ తరపున సంస్థ నిర్వాహక సభ్యులు చింతలపాటి సత్యదేవ్ , బి. అర్. కె. రాజు డా. డి. దిలీప్ కుమార్ , డా. సి. హెచ్ వరప్రసాద్ లకు మాస్టర్ ఇ. కె, కె . పార్వతీకుమార్ వ్రాసిన గ్రంథాలను బహుకరించారు . వైద్యశిబిరంలో 145 మందికి వైద్య సలహాలను అంజించారు. షుగర్, రక్తపరీక్షలను కూడా జరిపారు. సెవెన్ హిల్స్ హాస్పటల్స్ లో పదిమందికి ఉచితంగా శస్త్ర చికిత్సను చేయటానికి తగిన ఏర్పాట్లను చేస్తామని వైద్యులు సూచించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది . ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ఎప్పటికపుడు నిర్వహించమని ఈ ప్రాంతవాసులు కోరతున్నారు .

ఈ ఉచిత వైద్యశిబిర నిర్వహణకు జనకులం ఫౌండేషన్ ధర్మకర్త సి. హెచ్



శ్రీనివాస్, ఏ. యస్. రాజా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. జగదీశ్ , బాలభాను విద్యాలయం వ్యాయామ ఉపాధ్యాయుడు బి. రమణరావు , అలాగే గ్రామ వాలంటీర్లు సహకరించారు.

- చింతలపాటి, సత్యదేవ్ , డైరెక్టర్ ఆఫ్ సర్వీసెస్, జగద్గురుపీఠం .




# ఎమ్.వి.పి కోలనీలో గీతం ఉచిత వైద్యశిభిరం

సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : గీతం దంత వైద్య కళాశాల మరియు ఆస్పత్రి ఆధ్వర్యలో సోమవారం స్థానిక ఎమ్.వి.పి కోలనీలో లెబెన్‌షిల్ఫే పాఠశాల విద్యార్థులకు మరియు ఐఐఎమ్ విద్యార్థులకు గీతం ఉచిత దంత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత దంత వైద్య శిభిరంలో దాదాపు 180 మందికి బుద్ధి మాద్యం గల చిన్నారులు మరియు ఐఐఎమ్ విద్యార్థులు పాల్గొని దంత పరీక్షలు చేయించుకున్నారు. గీతం దంత వైద్య కళాశాల ఆస్పత్రి వైద్య నిపుణులు డాక్టర్ మనీష్‌కుమార్, డాక్టర్ మృదుల, డాక్టర్ ఇ.విజయశ్రీ, డాక్టర్ జానికి, డాక్టర్ ఐ.ప్రవలిక, డాక్టర్ కె.నికిల, డాక్టర్ ఐ. విశ్వేశ్వరి, డాక్టర్ సుష్మ తదితరులు పాల్గొన్నారు. సాధారణ వైద్య పరీక్షలతో పాటు, బిపి, సుగర్, దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ ఉచిత వైద్య శిభిరానికి ఐఐఎమ్ ఫ్యాకల్టీ సభ్యులు కె.సుప్రియ, శ్రీమనీష్‌కుమార్, స్వాతి, కో ఆర్డినేటర్‌గా కె.ముత్యాల నాయుడు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యూత్ క్లబ్ అభివృద్ధి కార్యక్రమం పై అవగాహన



సబ్బవరం (విజయభాను న్యూస్) : భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ విశాఖపట్నం వారి అధ్వర్యంలో "యూత్ క్లబ్ అభివృద్ధి కార్యక్రమం 'ఎంపీడీవో కార్యాలయం లో నిర్వహించడం జరిగింది. ధీనికి ముఖ్య అతిధిలు గా... సబ్బవరం ఎంపీడీవో బి.రమేష్ నాయుడు మరియు ఎంపీడీవో కార్యాలయం ఏఓ , సబ్బవరం గ్రామ పంచాయతీసెక్రటరీ , నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ కోఆర్డినేట్ జి మహేశ్వరరావు హాజరు అయ్యరు. ఈ సంధర్భంగా ఎంపీడీవో రమేష్ నాయుడు మాట్లాడుతూ యువతను యువకులను ఉద్దేసించి ప్రస్తుతం ఉన్నా పరిస్థితులను ఎదుర్కొనిఎలా ముందుకు సాగాలి,స్వయం అభివృద్ధి ఎలా సాధించాలి, యూత్ క్లబ్ అభివృద్ధి వల్ల ఉపయోగాలు వివరించారు.

నెహ్రూ యువ కేంద్ర జాతీయ వాలంటీర్లు అయినటువంటి మల్లిరెడ్డి నరేష్ మరియు జీ.పార్వతి ఐదు రోజుల పాటు వివిధ గ్రామాల్లో పర్యటించి యువజన సంగాలు ఏర్పాటు పై అవగాహన కల్పించారు.దీనిని గ్రామస్థాయిలో ఉన్నటువంటి యువతీ యువకుల యొక్క టాలెంట్ పై స్థాయికి ఏ విధంగా తీసుకుని వెళ్లాలి యూత్ క్లబ్ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఉపయోగాలు ఏంటి అని స్పష్టంగా యువత కి చెప్పడం జరిగింది అని ఎన్వైకెఎస్ విశాఖపట్నం యత్ కోఆర్డినేటర్ జి మహేశ్వర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## క్షణం..క్షణం..భయం..భయం

### ఫెర్రో ప్లాస్టిక్ పరిశ్రమలో అగ్నిప్రమాదం ఇద్దరుకి గాయాలు - బాధితులు న్యాయం చేయాలి

### సిఐటియు నాయకులు గనిశెట్టి డిమాండ్






పరవాడ (విజయభాను న్యూస్): మండలంఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్ లో భారీ ప్రమాదం ఫెర్రో ప్లాస్టిక్ పరిశ్రమలో సోమవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంతో ఇద్దరు కార్మికులు గాయాలు గురయ్యారు. ఒక కార్మికుడి పరిస్థితి సీరియస్ గా ఉండడంతో విశాఖపట్నం కేజీహెచ్ ఆసుపత్రికి తరలించారు నూర్ అసిల్ 28 అన్సాన్ 25 గాయపడ్డారు .పరిశ్రమలో భద్రత ప్రమాణాలు పాటించకపోవడం ఫైర్ సేఫ్టీ లేకపోవడం దీంతో ఈ ప్రమాదం సంభవించింది .అయితే తారు ఆయిల్ తయారు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగి ఒక కార్మికుడు కాలిపోయాడు ,ఈ ప్రమాదంపై సమగ్రమైన విచారణ చేయాలని ఈ పరిశ్రమంలో వలస కార్మికులతో పనులు చేయించుకొని కార్మిక చట్టాలను అమలు చేయకుండా భద్రత ప్రమాణాల అమలు చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్యం వలన ఈ ప్రమాదం సంభవించిందని సిఐటియు జిల్లా కార్యదర్శి గని శెట్టి సత్యనారాయణ అన్నారు, ఈ పరిశ్రమపై జిల్లా ఇన్స్పెక్టర్ ఫ్యాక్టరీస్ ఫైర్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు డిమాండ్ చేశారు. ప్రమాద సమయంలో పొగలుమంటలతో సమీప పరిశ్రమంలో ఉన్న కార్మికులు ఒక్కరిబిక్కరయ్యారు జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తున్నట్లు గని శెట్టితెలిపారు. ప్రమాద స్థలాన్ని పరవాడ సిఐ పెదిరెడ్ల ఈశ్వరావు పరిశీలించి ప్రమాదానికి గల కారణాలునూ అడిగితెలుసుకున్నారు,. పరవాడ మండల వైసిపి అద్యక్షులు బొద్దపు చిన్నారావు బాధితులుకు తగు న్యాయం చేయాలానీ ,భద్రతా ప్రమాణాలు పాటించనీ కంపెనీ పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నాలుగేళ్ల చిన్నారి పై కర్కశత్వం...

## - మైనర్ బాలిక పై అత్యాచారం..

## - పోక్సో, ఎస్సి ఎస్టి ఆట్రాసిటీ కేసు నమోదు..

మండపేట (విజయభాను న్యూస్) : అభం శుభం తెలియని చిన్నారి పై ఓ మానవ మృగం విరుచుకుపడ్డాడు. కర్కశంగా బాలిక ను అత్యాచారం చేసాడు. ఈ ఘటన మండపేట మండలం ద్వార పూడి శివారు వేములపల్లి లో సోమవారం చోటుచేసుకుంది. రూరల్ సి ఐ పెద్దిరెడ్డి శివ గణేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండపేట మండలం ద్వారపూడి శివారు వేములపల్లి లోని రామకృష్ణ పౌల్ట్రీ వద్ద కార్మికుల మకాం లో పెంకే రమణ (58) అదే మకాం వద్ద తన అమ్మమ్మ నాయనమ్మ ల వద్ద కు వచ్చిన ఓ నాలుగేళ్ళ చిన్నారి పై అత్యాచారం జరిపాడు. తీవ్ర రక్త స్రావం కావడంతో గుర్తించి న తల్లి కాకాడ నాగలక్ష్మి తన భర్త కాకాడ ప్రసాద్ కు తెలిపింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రామచంద్రపురం డి ఎస్ పి బాలచంద్ర రెడ్డి, సి ఐ పెద్ది రెడ్డి శివ గణేష్, రూరల్ ఎస్ ఐ బళ్ల శివ కృష్ణ లు ఘటన స్థలానికి చేరుకున్నారు. విచారణ చేపట్టారు. కాగా బాలిక తల్లిదండ్రులు వేములపల్లి ఇందిరమ్మ కాలనీ లో నివసిస్తున్నారు. తండ్రి ఆటో డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. ఈ పౌల్ట్రీ ఫారం లో బాలిక అమ్మమ్మ, నానమ్మ లు చాలా కాలం నుండి పనిచేస్తూన్నారు. ఈ నేపథ్యంలో పెంకే రమణ కూడా ఉత్తరాంధ్ర జిల్లా ల నుండి ఇక్కడ కు చాలా ఏళ్ళ క్రితం వలస వచ్చాడు. ఇప్పుడు అతని భార్య ఆ కోళ్లఫారం లో పనికి వెళుతుంది.

ఈ క్రమంలో ఆటలాడుకుంటున్న చిన్నారి ని రమణ తన ఇంట్లో కి తీసుకుని వెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. విచారణ అనంతరం డి ఎస్ పి బాలచంద్ర రెడ్డి మాట్లాడుతూ బాధితులు ఫిర్యాదు మేరకు పొక్సో, ఎస్ సి ఎస్ టి అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాలిక ను మండపేట ప్రభుత్వ

# బీసీల అభ్యున్నతికి బిజెపి కట్టుబడి ఉంది

## ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : రాష్ట్ర విభజన తర్వాత బిసిలే ఎక్కువగా నష్ట పోయారని ఎమ్మెల్సీ పి.వి.ఎన్. మాధవ్ తెలిపారు. సోమవారం అల్లూరి సీతారామ రాజు భవన్ లోచట్టసభల్లో బీసీలకు ప్రాతినిథ్యం ఇవ్వాలి అనే అంశం పైబీసీ వెల్ఫేర్ జెఎసి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూతెలంగాణ ప్రాంతంలోఅక్కడి టిఆరెస్స్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన అక్కడ ఉంటున్న ఆంధ్ర ప్రాంతానికి చెందిన 25 లక్షల బిసి కులాలవారు తీవ్రంగా నష్టపోయారని అన్నారు.వీరిలో ఉత్తరాంధ్ర కు చెందిన బిసి వారే ఎక్కువగా ఉన్నారని చెప్పారు. దీని పై అక్కడి ప్రభుత్వం తో మాట్లాడిన ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు.బిసిల సంక్షేమానికి బిజెపి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.రాజకీయ పార్టీలు ఖచ్చితంగా బీసీలకు రాజకీయప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ డి.రామారావు,రాష్ట్ర అధ్యక్షులు ఏ.అదిశేషు, ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు, ఉపాధ్యక్షులు కె. జగన్ మోహన రావు,గౌరవ సలహాదారులు బి.ఆనందయ్య, పి.వెంకట రావు, యనమల కృష్ణుడు,జనసేనడాక్టర్స్ సెల్ అధ్యక్షులు రఘు, జేఏసీఅధికార ప్రతినిధి డి.మస్తానమ్మ,డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, ఆడారి కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో

# కార్మిక పోరాటాలు ఉధృతం చేస్తాం

## - సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.బాలదేవ్



అల్లూరిసీతారామరాజు జిల్లా అరకులోయ (విజయభాను న్యూస్) : కార్మిక హక్కులు చట్టాలు అమలుకై క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మరిన్ని పోరాటాలు ఉధృతం చేస్తామని అరకులోయలో సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించరు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి బాలదేవ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులు,చట్టాలను నిర్వీర్యం చేస్తూ సవరణలు చేస్తున్నారని 44 కార్మిక చట్టాలు 4 కోడ్లుగా మార్చి కనీస వేతన చట్టం సవరణ చేస్తూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, బిజెపి ప్రభుత్వం ఆజాదిక అమృత మహోత్సవం పేరుతో దేశభక్తిని పరిక్షిస్తుందని స్వతంత్ర పోరాటంలో ఏనాడు పాల్గొనని వారు దేశభక్తి కోసం మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని,75 సంవత్సరాల స్వాతంత్ర్య దేశంలో కార్మికులకు కనీస వేతనం అమలు కావడం లేదని, స్వతంత్రం అంటే అందరికీ తిండి, బట్ట ,ఇల్లు ,ఉపాధి, ఉద్యోగం, విద్య, వైద్యమని కానీ వీటికి భిన్నంగా కార్మిక హక్కులు, చట్టాలు రద్దు చేస్తూ కనీస వేతనం కూడా ఇవ్వకుండా కార్మికులకు అన్యాయం చేస్తూ ఆజాదిక అమృత మహోత్సవం పేరుతో 75 సంవత్సరాల స్వతంత్ర దినోత్సవం పేరిట కార్మికులకు ప్రజలకు మోసం చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని ఆంధ్ర రాష్ట్రంలో లో స్కిమ్ వర్కర్లుగా పనిచేస్తున్న అంగన్వాడి, ఆశ, మిడ్ డే మీల్స్ ,విఓఎలు,ఐటీడీఏ, సూప్ యూనిట్, ఆసుపత్రికి, పంచాయతీ,టూరిజం కార్మికులకు కనిసవేతనం 21వేలు ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, భవననిర్మాణం కార్మికులకు గుర్తింపు కార్డులు పనిభద్రత కల్పించాలని,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో మరో స్వతంత్ర పోరాటానికి కార్మికవర్గం సన్నద్ధం అవుతుందనారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షులు వి సింహాద్రి,ఆశ, సి హెచ్ డబ్ల్యు సంఘం నాయకులు రాధ, వరహాలమ్మ, సుమిత్ర, అంగన్వాడీ సంఘ నాయకులు, బిమలమ్మ,ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజు, రాంబాబు,లక్ష్మి షోప్ యూనిట్ నాయకులు దాసుబాబు, టూరిజ నాయకులు అంజలిరావు, పెయింటర్ సంఘం నాయకులు కొండలరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్పందన ఆర్జీలను గడువులోగా పరిష్కరించాలి

## - అధికారులకు కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ ఆదేశాలు

## - మొత్తం 364 అర్జీలు స్వీకరణ



కాకినాడ (విజయభాను న్యూస్) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందనలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు నిర్దిష్ట గడువులోగా సంతృప్తికరమైన సమాధానాలు ఇచ్చి పరిష్కరించాలని కాకి నాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధి. కారులను ఆదేశించారు. సోమవారం జిల్లాస్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకరణ, పరిష్కార కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్ స్పందన హాలులో నిర్వహిం చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ.. డీఆర్వో కె.శ్రీధర్ రెడ్డి, కాకినాడ సెజ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. మనోరమ, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ డి.పుష్పమణిలతో కలిసి ప్రజల నుంచి విజ్ఞాపనలను స్వీకరించి ఆయా శాఖల ద్వారా నిర్దిష్ట గడువులో పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో మొత్తం 364 అర్జీలు స్వీకరించారు. ఉపాధి అవకాశాలు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కింద ఇళ్ల మంజూరు, రెవెన్యూ సేవలు, సర్వే, పెన్షన్, బీమా తదితరాలపై అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్య క్రమంలో వచ్చిన దరఖాస్తులను నాణ్యతతో గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు.

రీఓపెన్ అయ్యే దరఖాస్తులపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అనంత బాబుకు పోలీసులు అనధికార సహకారం

## 90 రోజులు వరకు ఛార్జ్ షీట్ వేయకపోతే అనంత బాబుకు బెయిల్




రాజమండ్రి (విజయభాను న్యూస్): 90 రోజులకు కూడా ఛార్జ్ షీట్ కోర్టులో పోలీసులు వేయకపోతే చట్ట ప్రకారం కోర్ట్ అన%శీ%త బాబుకు బెయిల్ ఇస్తుందని అందుకోసమే పోలీసులు చార్జ్షీట్ వేయకుండా పరోక్షంగా సహకరిస్తునారెమో అని అనుకోవాలసి వస్తుందని ప్రముఖ నాయవాది, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముప్పాళ సుబ్బారావు అనుమానం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో పిట్టా వర ప్రసాద్, జార్జి అంథోని,ఇసుకపట్ల రాంబాబు, కొల్లాపు వేణు, ధార ఎసురత్నం, నక్కా వెంకటరత్నం, కె. వి. ఎస్. ఎం. కుమార్ లతో కలసి పత్రికా ప్ర తినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర స్థలం గుర్తించడం లో మిగిలిన నేరస్థులను అరెస్టు చేయడంలో వైపల్యం అయ్యారన్నారు. సీసీ పుటేజీలను స్వాధీనపరచుకొని ఎందుకు పోలీసులు విచారణను ముందుకు తీసుకెళ్ళడం లేదో అర్థం కావడంలేదన్నారు.కస్టడీలోకి ముద్దాయిని తీసుకోవడానికి వేసిన పిటిషన్ గడువు ముగిసే చివరి నిమిషం వరకు ఎందుకు జాప్యం చేశారని.. ఇది ముద్దాయిని కాపాడే ప్రయత్నం కాదా? అని ముప్పాళ్ళ ప్రశ్నిం చారు. మానవ హక్కుల కమిషన్లో బాధితుల తరపున కేసు వేసిన తర్వాతే ఈ కేసులో సాక్షుల యొక్క వాంగ్మూ లంను 55 రోజుల తర్వాత సిఆర్పిసి సెక్షన్ 164 ప్రకారం మేజిస్ట్రేట్ ముందు నమోదు చేశారన్నారు. ఎమ్మెల్సీ అనంతబాబుకు సెక్యూరిటీగా ఉన్న పోలీసులను సస్పెండ్ చేసారు కానీ వారిని విచారించినట్లుగా కనిపించడం లేదన్నారు. నేర చరిత్ర ఉన్నవారిని చట్టసభలకు పంపిస్తారా? దళిత యువకుడ్ని అతి కిరాతకంగా హత్య చేసిన గత నేర చరిత్ర కల్గిన అనంతబాబుని అధికార పార్టీ నుంచి సస్పెండ్ చేశామని ప్రకటించి అతనికి అధికార పార్టీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పాలాభిషేకం, వైసిపి ప్లీనరీ సమా వేశాల్లో అతని సింహంతో పోల్చడం, ఆలయాలు, మసీదులు, చర్చిలలో ముద్దాయికి అనుకూలంగా విడుదల కావాలని పూజలు, ప్రార్థనలు చేయించడం ఇది ఏ రకమైన సంస్కృతని ముప్పాళ్ళ మండిపడ్డారు. గత నేరచరిత్ర ఉన్న వ్యక్తులను, నగ్న దృశ్యాలు చూపిస్తూ అసభ్యకరంగా వ్యవహరించే వ్యక్తులను అధికార పార్టీ వారు చట్టసభలకు పంపడానికి అర్హులుగా నిర్ధారించడం దారుణమన్నారు. సెంట్రల్ జైల్లో.. అనంతబాబుకు రాచమర్యాదలు హత్యకేసులో ముద్దాయికి సెంట్రల్ జైల్లో రాచమర్యాదలు చేయడం.. జైలు అధికారుల ప్రత్యేక ప్రేమాభిమానాలపై త్వరలోనే నిజనిజాలు బట్టబయలు చేస్తామన్నారు. చార్జిషీట్కు 12 రోజులే సమయం.. డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం మే 19న హత్య చేయబడ్డాడని.. ఆ తర్వాత నమోదైన ఈ కేసులో చార్జిషీటు వేయడా నికి ఇంకా 12 రోజులు మాత్రమే సమయం ఉందని ముప్పాళ్ళ తెలిపారు. అంటే ఆగస్టు 20వ తారీకులోపుగా విచారణ అధికారి చార్జ్షీట్ కోర్టులో వేయవలసి ఉందన్నారు. లేకుంటే అతను చట్టపరమైన చర్యలకు గురి కావాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నామన్నారు. నిర్దేశించిన సమయంలో చార్జ్ షీట్ దాఖలు చేయకపోతే అది కూడా ముద్దాయికి సహకరించడమే అవుతుందని.. ముందు చార్జిషీట్ దాఖలు చేసి తదుపరి వచ్చిన ఇతర సమాచా రంతో అడిషనల్ చార్జిషీట్ కూడా దాఖలు చేయవచ్చునన్నారు. హైకోర్టులో సిబిఐ విచారణ కొరకు వేసిన పిటిషన్ పరిష్కారానికి సమయం పడుతుందని.. ఈ లోపుగా విచారణ అధికారి తన చట్టబద్ధ విధులను సక్రమంగా నిర్వహించవలసి ఉన్నదని ముప్పాళ్ళ సుబ్బారావు పేర్కొన్నారు.

### విశాఖ శారదా పీఠాధిపతులను కలిసిన

# కేదార్‌నాథ్ ప్రధానార్చకులు



ఋషికేష్(విజయభాను న్యూస్): కేదార్‌నాథ్ క్షేత్రం ప్రధానార్చకులు రాజశేఖర్ పండిట్ సోమవారం విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామిని కలిసారు. ఋషికేష్ లో చాతుర్మాస్య దీక్ష చేస్తున్న సందర్భంగా స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వామివార్లను కలిసి ఆశీస్సులు అందుకున్నారు. కేదారేశ్వరుని ప్రసాదాన్ని పీఠాధిపతులకు అందజేసారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర గతంలో కాలినడకన తాను చేపట్టిన చార్ ధామ్ యాత్రను గుర్తు చేసుకున్నారు. కేదార్‌నాథ్ సందర్శన సమయంలో ఎదురైన అనుభవాలను ప్రధానార్చకులు రాజశేఖర్ పండిట్ కు వివరించారు.

# మంత్రి ఉషశ్రీ చరణ్ కు

## స్వామి స్వరూపానందేంద్ర ఆశీస్సులు



ఋషికేష్(విజయభాను న్యూస్): ఆంధ్రప్రదేశ్ స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ సోమవారం ఋషికేష్ వెళ్లారు. అక్కడ చాతుర్మాస్య దీక్షలో ఉన్న విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములను కలిసారు. పీఠాధిపతుల ఆశీస్సులు అందుకున్నారు. కుటుంబంతో సహా ఋషికేష్ వెళ్ళిన మంత్రి ఉషశ్రీ చరణ్ మూడు రోజులపాటు అక్కడే ఉంటారు. శ్రీ శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారి పీఠార్చనలో పాల్గొంటారు.

# తెలుగు ప్రజలకు మీరు గర్వకారణం

### వెంకయ్య వీడ్కోలు సమావేశంలో విజయసాయి రెడ్డి



న్యూఢిల్లీ : ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మెన్ వెంకయ్య నాయుడు కోట్లాది మంది తెలుగు ప్రజలకు గర్వకారణమని వైఎస్సార్సీపీ సభ్యులు విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. ఎం. వెంకయ్య నాయుడు చైర్మన్‌గా పదవీ విరమణ చేయబోతున్న సందర్భంగా రాజ్యసభలో సోమవారం జరిగిన వీడ్కోలు సమావేశంలో విజయసాయి రెడ్డి మాట్లాడారు. రాజ్యసభ అధ్యక్ష స్థానంలో తెలుగు వ్యక్తి కూర్చోవడం గురించి పార్లమెంటులోని ఉభయసభల్లో తెలుగు రాష్ట్రాల ఎంపీలు గర్వంగా చెప్పుకుంటారని అన్నారు. వెంకయ్య నాయుడి సొంత జిల్లా అయిన నెల్లూరుకు చెందిన వ్యక్తి కావడం తన అదృష్టమని అన్నారు. అనేక సభల్లో ఆయన చేసిన ఉపన్యాసాలు తెలుగు రాష్ట్రాల ప్రజలనే కాక దేశ వ్యాప్తంగా ప్రజలను ఎంతగానో ప్రభావితం చేశాయని అన్నారు. వెంకయ్య ప్రసంగాలతో ఒక విద్యార్థిగా తాను కూడా ఎంతో ప్రభావితమయ్యానని అన్నారు. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ చెప్పినట్లుగా తెలుగు, ఇంగ్లీష్, హిందీ, తమిళం వంటి అనేక భాషలలో వెంకయ్యనాయుడి పరిజ్ఞానం అపారమైనదని ఆయన కొనియాడారు. రాజ్యసభను సమర్ధవంతంగా నడిపించడం, కొత్త, పాత అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ మాట్లాడే అవకాశం కల్పించడం శ్రీ వెంకయ్య ప్రత్యేకత. ఈ సందర్భంగా 2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370పై జరిగిన చర్చను విజయసాయి రెడ్డి సభకు గుర్తుచేశారు. ఉద్రిక్త వాతావరణంలో చర్చ జరుగుతున్నప్పటికీ తమలాంటి ప్రాంతీయ పార్టీలకు సైతం ఆ బిల్లుపై మాట్లాడే అవకాశం కల్పించడం వెంకయ్య నాయుడి గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలకు శ్రీ వెంకయ్య నాయుడు ఇచ్చిన ప్రాధాన్యత ఎనలేనిదని అన్నారు. సమయానుకూలంగా సమీక్షలు నిర్వహించి విలువైన సూచనలు అందించడం ద్వారా కమిటీలు సమర్ధవంతంగా పనిచేశాయి. స్టాండింగ్ కమిటీల చైర్మన్లు, సభ్యుల్లో స్ఫూర్తిని ఆయన స్ఫూర్తిని నింపారు. రాజ్యసభ ప్యానల్ వైస్ చైర్మన్ రాజ్యసభ అధ్యక్ష స్థానంలో కూర్చొని సభను నిర్వహించే అవకాశం కల్పించడం తన జీవితంలో మరుపురానిదని విజయసాయి రెడ్డి అన్నారు. ఆయన ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు.

# గీతంలో జాతీయ జెండాతో భారీ ర్యాలీ



### ఘనంగా అజాదీకా అమృత్ మహోత్సవ్

సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : అజాదీకా అమృత్ మహోత్సవ్ లో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఆగష్టు 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్న కార్యక్రమాలలో సోమవారం జాతీయ పతాకాన్ని చేత బూని దాదాపు వెయ్యి మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. గీతం కేంపస్ లైఫ్ ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్‌లు మహత్మ గాంధీ విగ్రహం వద్ద ర్యాలీ ని ప్రారంభించారు. గీతం ఎన్‌సిసి అధికారులు కెప్టెన్ బి.శ్రీనివాసరావు, డాక్టర్ పరిమళ వేణు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్, క్రీడా విభాగం డైరక్టర్ అరుణ్ కార్తిక్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు భారత మాతాకీ జై, హర్‌ఘర్‌కా తిరంగా తదితర నినాదాలతో ర్యాలీలో వర్షాన్ని సహితం లెక్క చేయకుండా పాల్గొన్నారు. చివరగా జాతీయ గీతంతో ఘనంగా కార్యక్రమాన్ని ముగించారు. స్వాతంత్రం 75 ఉత్సవాలు సందర్భంగా ఇప్పటికే ప్రత్యేకంగా పుస్తక ప్రదర్శన, గాంధీ మ్యూజియం సందర్శన వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు క్విజ్, వకృత్వ పోటీలను, క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు గీతం కేంపస్ లైఫ్ ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు తెలపారు.

# ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

### ఐదుగురి మృతి

**కంభం,** ప్రకాశం జిల్లా కంభం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీని ఓ కారు వెనకనుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మాచర్ల నుంచి తిరుపతికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మృతులను పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం సిరిగిరిపాడు వాసులుగా గుర్తించారు. మృతుల్లో అనిమిరెడ్డి (60), గురవమ్మ (60), అనంతమ్మ (55),ఆదిలక్ష్మి (58), నాగిరెడ్డి (24) ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దగ్గర్లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# గిరిజనుల హక్కులను ప్రభుత్వం హరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు

### - జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్




డాబాగార్డెన్స్ (విజయభాను న్యూస్): రాష్ట్ర జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి ఆగస్టు 9, ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆదివాసులకు జరుగుచున్న అన్యాయాల్ని, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలియ జేయుటకు జనసేన పార్టీ తరుపున విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సమావేశం జనసేన పార్టీ అరకు పార్లమెంటు ఇన్చార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్య అధ్యక్షతన నిర్వహించబడినది. ఈ సందర్భంగా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ మాట్లాడుతూ రాజ్యాంగంలో వున్న ఆర్టికల్ 244 ప్రకారం దేశంలో 10 రాష్ట్రాలకు 5వ షెడ్యూలు ఏర్పాటు చేయబడింది. ఈ షెడ్యూలులో మన తెలుగు రాష్ట్రాలు కూడా ఉన్నాయి. ఈ షెడ్యూలు ప్రకారం గిరిజన ప్రాంతాల్లో భూ విక్రయాలుగాని, లీజులుగాని, మైనింగ్గాని గిరిజనుల నుండి గిరిజనేతరులకు ఎలాంటి బదలాయింపులు జరగకూడదని రాజ్యాంగంలో స్పష్టంగా వుంది. ఇది గిరిజనులకిచ్చిన రక్షణ కవచం లాంటిది. దీన్ని ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుంది. చాలా గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల భూములను, ఆస్తులను ఆక్రమించుకుని, గిరిజన మనుగడకు, అభివృద్ధికి అవరోధంగా మారింది. వీటిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గిరిజనులకు ఆరోగ్యం, విద్య, రవాణా మొసౌకార్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. గిరిజన హక్కులకోసం జనసేన పార్టీ పోరాటం చేస్తుంది అని తెలియజేసారు. ఈ సందర్భంగా డాక్టర్ వంపూరు గంగులయ్య మాట్లాడుతూ రాజ్యాంగంలో గిరిజన అభివృద్ధి కోసం, హక్కులకోసం 1/70 యాక్టును ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. గిరిజన ప్రాంతాల్లో గిరిజనులకు, గిరిజనేతరులకు మధ్య ఘర్షణలు సృష్టించి ఈ ప్రభుత్వం ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, చట్టాలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనేకమంది గిరిజన ప్రాంతం నుండి వచ్చిన జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# 11 నుంచి విద్యుత్ అవగాహన సదస్సులు

### - సిజిఆర్‌ఎఫ్ ఛైర్ పర్సన్ బి.సత్యనారాయణ



విశాఖపట్నం(విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం మరియు ఏలూరు సర్కిళ్ళ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రతినెల విద్యుత్ అవగాహనా సదస్సులను ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సిజిఆర్‌ఎఫ్) ఛైర్ పర్సన్, విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 11వ తేదిన విశాఖపట్నం సర్కిల్ నర్సీపట్నం డివిజన్, 17వ తేదిన ఏలూరు సర్కిల్ తాడేపల్లిగూడెం డివిజన్, 18వ తేదిన రాజమహేంద్రవరం సర్కిల్ జగ్గంపేట డివిజన్, 24వ తేదిన శ్రీకాకుళం సర్కిల్ టెక్కలి డివిజన్, 26వ తేదిన విజయనగరం సర్కిల్ బొబ్బిలి డివిజన్లలో విద్యుత్ సదస్సులను ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 01.30 వరకు నిర్వహించనున్నామని తెలిపారు.

ఈ సదస్సులలో వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్తు సంబంధిత సమస్యలను సిజిఆర్‌ఎఫ్ కమిటీకి విన్నవించుకోవచ్చని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరు మార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్ఫార్మర్ల మార్పిడి, తదితర సమస్యలను తెలియజేయవచ్చన్నారు.

అంతేకాకుండా ఏపిఈపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం ఏట సిభవనం, సీతమ్మధార, విశాఖపట్నం చిరునామాలోని సిజిఆర్‌ఎఫ్ కార్యాలయానికి ఏవిధమైన రుసుము చెల్లించనవసరం లేకుండా రాతపూర్వకంగా కూడా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. వినియోగదారుల సమస్యల వివరాలను పరిశీలించి, విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని తెలిపారు. ఈ సదస్సుల్లో ఛైర్ పర్సన్ బి.సత్యనారాయణతో పాటు సిజిఆర్‌ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.హరిబాబు, పి.శ్రీనివాస్, బాలాజీ ప్రసాద్ పాండే పాల్గొంటారని తెలిపారు.

## స్ఫూర్తి పథకం కింద ఏపీలో 16 క్లస్టర్లు

#### రాజ్యసభలో విజయసాయి రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబు

న్యూఢిల్లీ : సంప్రదాయ పరిశ్రమల పునరుజ్జీవ నిధి పథకం (స్ఫూర్తి) కింద ఆంధ్రప్రదేశ్‌లో 16 క్లస్టర్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్లు చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ భాను ప్రతాప్ సింగ్ వర్మ తెలిపారు. రాజ్యసభలో సోమవారం వైఎస్సార్సీపీ సభ్యులు వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా జవాబిస్తు ఆమోదం తెలిపిన 16 క్లస్టర్లకుగాను ఇప్పటికే 6 క్లస్టర్లు పని ప్రారంభించాయని చెప్పారు. చిత్తూరు జిల్లాలోని కలంకారీ క్లస్టర్, తూర్పు గోదావరి జిల్లాలో ఆగ్రో ఇండస్ట్రీ, హార్టికల్చర్, ఫ్లోరీకల్చర్ ఉత్పాదనలు ప్రాసెస్ చేసే క్లస్టర్, గుంటూరు జిల్లా మంగళగిరిలో బంగారు నగల క్లస్టర్, విశాఖపట్నం జిల్లాలో కాఫీ క్లస్టర్, విజయనగరం జిల్లాలో కాయర్ (కొబ్బరి పీచు) ఉత్పాదనల క్లస్టర్, బంగారు నగల క్లస్టర్ పని చేస్తున్నట్లు చెప్పారు. మిగిలిన 10 క్లస్టర్లలో పనులు కొనసాగుతున్నాయి. ఇందులో అత్యధికం ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పని ప్రారంభిస్తాయని మంత్రి తెలిపారు.

# నాడు - నేడు పనులను వేగవంతం చేయాలి

### - నిర్ధిష్ట ప్రణాళిక తో ముందుకు వెళ్లండి - జాయింట్ కలెక్టర్ కె ఎస్ విశ్వనాథన్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : నాడు - నేడు పనులను వేగవంతం చేయాలని, నిర్దిష్ట ప్రణాళిక తో ముందుకు సాగాలని జాయింట్ కలెక్టర్ కే ఎస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నాడు- నేడు పాఠశాల భవనాలు, సచివాలయాలు,రైతు భరోసా కేంద్రాలు , డిజిటల్ లైబ్రరీల పురోగతి కి సంబంధించి సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లో సమావేశ మందిరం నందు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎం.పి.డి ఓ లు, డి.ఈలు , ఏ.ఈ.లతో సమీక్ష నిర్వహించారు. ఈ సంధర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ భవనాల నిర్మాణాల పురోగతి కి సంబందించి అధికారులు పని తీరును మార్చుకొని నిర్దేశించిన వారపు లక్ష్యాలను పూర్తి చేయాలని, ఒక నిర్దిష్ట ప్రణాళిక తో ముందుకు వెళ్ళడం ద్వారా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కోర్టు కేసులు మినహా మిగిలిన అన్ని చోట్ల పనులు జరగాలన్నారు. జలజీవన్ మిషన్ లో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు కృషి చేయాలన్నారు. వైఎస్సార్ జలకళ, అమృత్ సరోవర్ పనుల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనికి ఆహార పథకం కింద ప్రతి గ్రామం నుంచి కూలీలను నియమించి గ్రామస్థులకు ఉపాధి హామీ కల్పించాలన్నారు. గ్రామ పంచాయితీల వారిగా సమీక్షలు జరిపి రోజు వారి కూలీల సంఖ్య పెరిగేల చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పని దినాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డిఇఓ చంద్రకళ, డ్వామా ఇంఛార్జి శ్రీనివాసరావు, పంచాయత్ రాజ్ ఎస్.ఇ, జీవీఎంసీ అధికారులు , తహశీల్దార్ లు , ఎం.పి.డి.ఓ లు సంబంధిత జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com